
మంగళవారం 24.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 336 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సంవత్సరాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గట్టెక్కించింది. పెట్టుబడులు ఆకర్షించి ఆదాయం పెంచి సంక్షేమం, అభివృద్ధి దిశగా చంద్రబాబు, లోకేష్ కృషి చేస్తున్నారు. అయినప్పటికి జగన్మోహన్ రెడ్డి విమర్శలు కొనసాగిస్తున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



## చంద్రబాబు అనే నేను చెబుతున్నా...


# దేశంలో పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్



- స్టీల్ ప్లాంట్‌కు ఫౌండేషన్ కాదు... స్టీల్ సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం
- దేశ ఉక్కు అవసరాలు తీర్చేలా ఏపీ అభివృద్ధి సాధిస్తోంది
- ఉత్తరాంధ్రకు ఊపు తెచ్చే ప్రాజెక్ట్... రాష్ట్రాన్ని ప్రగతి బాట పట్టించే ప్రాజెక్ట్
- రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడి... 1 లక్షకుపైగా ఉద్యోగాలు
- రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : అనకాపల్లిలో జరిగిన శంకుస్థాపన స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే కాదని... స్టీల్ సిటీ నిర్మాణం కోసమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏపీకి రావడం చాలా మంచి పరిణామమని.. అనకాపల్లి, ఉత్తరాంధ్ర ప్రాంతంతో పాటు రాష్ట్రం ప్రగతి వైపు పరుగులు పెట్టడానికి ఈ స్టీల్ ప్లాంట్ ఉపకరిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. చంద్రబాబు నాయుడు అనే నేను చెబుతున్నా... పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్ అంటూ సీఎం ప్రకటించారు. సోమవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు శంకుస్థాపన ఘనంగా జరిగింది. కేంద్రమంత్రి హెచ్‌డి కుమార స్వామి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్ సంస్థకు చెందిన ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుపస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."20 నెలల్లోనే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటును శంకుస్థాపన చేసుకున్నాం. ఈ భారీ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షమంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఈ ప్రాజెక్టు రావడానికి కృషి చేసిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తున్నా. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం భూమిని ఇచ్చిన రైతులందరికీ ధన్యవాదాలు.

మిగతా 2లో...




## దేశంలో సరిపడా ఇంధన నిల్వలు



- లోక్ సభలో ప్రధాని మోదీ ప్రకటన

ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : గల్ఫ్ దేశాల్లో యుద్ధం కారణంగా అనేక సమస్యలు వస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇవాళ లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అంశాలపై అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నామని అన్నారు. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచి ముడిచమురు, గ్యాస్ వస్తోందని తెలిపారు. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోందని వివరించారు. ముడిచమురును సముద్రమార్గం ద్వారానే మనం తెచ్చుకుంటున్నామని అన్నారు.

**దేశ ప్రజలపై భారం పడకుండా చర్యలు..** పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని ప్రధాని మోడీ తెలిపారు. అదేవిధంగా గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో భారతీయుల భద్రతపై నిరంతరం చర్చలు జరిపామని గుర్తు చేశారు. అక్కడ చదువుకునే మనదేశ పిల్లల భద్రతకు ఇబ్బంది లేకుండా చూశామని అన్నారు. భారత్‌కు వచ్చే నౌకలన్నీ హర్మూజ్ జలసంధి నుంచే వస్తాయని తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో దేశ ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

**పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలుపుతున్నాం :** ముడిచమురు, ఎల్‌పీజీ గతంలో 27 దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, ఇప్పుడు 41 దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని ప్రధాని మోడీ అన్నారు.

మిగతా 2లో...

## ముస్లిం బాలికల చదువు కోసం

# ఎమ్మెల్సీ ఆలపాటి ఆర్థిక సాయం


- మదర్సా వికాసానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లక్ష రుపాయలు వితరణ
- అల్లా చల్లగా చూడాలన్న మత పెద్దలు

తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) : ముస్లిం బాలికల చదువుల కోసం శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తన వంతుగా లక్ష రూపాయలు మదర్సా కు పంపడం జరిగిందని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ పేర్కొన్నారు.

పట్టభద్రుల శాసన మండలి సభ్యులు, తెనాలి టిడిపి ఇంచార్జీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిన లక్ష రూపాయల చెక్కును, సోమవారం పార్టీ కార్యాలయంలో

మిగతా 2లో...





## బ్రాండ్ సీబీఎన్ వల్లే రాష్ట్రానికి భారీ ప్రాజెక్టు

- ఆంధ్రప్రదేశ్ పై నమ్మకం, విశ్వాసానికి ప్రతీక ఏఎంఎన్‌ఎస్ స్టీల్ ప్లాంట్
- రికార్డు స్థాయి వేగంతో అనుమతులు తెచ్చాం
- ఒక్క జూమ్ కాల్ ఏపీ భవిష్యత్తుని మార్చేసింది
- 20నెలల్లో ఇన్వెస్ట్ మెంట్ డెస్టినేషన్‌గా ఏపీని మార్చాం
- ఏఎంఎన్‌ఎస్ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్




2లో

అనకాపల్లి(జర్నలిస్ట్ ఫైల్) : ఈరోజు ఆర్సెలర్ మిట్టల్ & నిప్పాన్ స్టీల్స్ చేస్తున్నది కేవలం భూమిపూజ కార్యక్రమం మాత్రమే కాదు, ఇది ఒక విశ్వాసం, నమ్మకంతో కూడిన ప్రకటన. ఆంధ్రప్రదేశ్ లోని ప్రజాప్రభుత్వం చెప్పింది చేయగలదని ప్రపంచానికి చాటిచెప్పే ప్రకటన అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలో ఏఎంఎన్ఎస్ సంస్థ నిర్మించనున్న దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఇది స్టీల్ ప్రాజెక్టు గురించి మాత్రమే కాదు, మన బలం, ధైర్యం, నమ్మకం గురించి. ఒకసారి మిమ్మల్ని 2019 జనవరి నాటి దావోస్ కి తీసుకెళ్తాను. అప్పట్లో నేను అదిత్య మిట్టల్‌ని కలవాలని ప్రయత్నించాను, కానీ సమయం ఇవ్వలేదు. టాటా గ్రూప్ నైట్ క్యాంప్ లో ఆయనను కలిసి ఒక సింపుల్ అభ్యర్థన చేశాను. "ఆంధ్ర ప్రదేశ్‌లో మీరు ఎందుకు ఇన్వెస్ట్ చేయరు?" అని అడిగాను. ఆయన మర్యాదపూర్వకం గానే "మేము ఇప్పటికే మరో రాష్ట్రాన్ని చూస్తున్నాం" అన్నారు. "మీ నిర్ణయాన్ని గౌరవిస్తాను. అది జరగకపోతే, ఆంధ్రప్రదేశ్ మీకోసం సిద్ధంగా ఉంది." అని చెప్పాను.

## ఏప్రిల్ 6 నుంచి

# బీజేపీ 'మన ఊరు - మన జెండా'



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రకటన

విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావానికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'మన ఊరు - మన జెండా' పేరుతో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఈ ప్రచారానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, జనసంఘ్ నుంచి బీజేపీ వరకు



## హామీ నెరవేర్చా..

# శెట్టి బలిజలకు అండగా ఉంటా

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో శెట్టి బలిజలందరికీ తాను అండగా ఉంటానని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. సోమవారం శెట్టిబలిజల ఆరాధ్యదైవం, శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకులు, సంఘ సంస్కర్త అయిన దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా విశాఖ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మిగతా 2లో...

## పాలన బలంగా ఉంటేనే...

# పెట్టుబడులు బలంగా వస్తాయి




- గత ప్రభుత్వంలో వచ్చిన పెట్టుబడులు వెనక్కి పోయాయి..
- కూటమి పాలనలో పెట్టుబడులు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నాయి
- రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అన్ని విధాలా అనుకూల వాతావరణం కల్పించాం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో నమ్మకాన్ని పెంచాం
- ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్ తో ఉత్తరాంధ్ర దశ దిశ మారిపోనున్నాయి
- అనకాపల్లిలో ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

● వివరాలు 2 లో

## ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మారేలా

# యాక్షన్ ప్లాన్



- శ్రీకాకుళం-కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణకు చర్యలు
- ఈ నెల 26వ తేదీ కల్లా పంట నష్టంపై నివేదిక ఇవ్వండి
- ఏఐ ఇంటిగ్రేషన్‌తో మెరుగైన ప్రజా సేవలకు ఆస్కారం
- ఆర్టీజీఎస్ సమీక్షలో అధికారులతో సీఎం చంద్రబాబు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ప్రస్తుతం ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మళ్లడమే సరైన పరిష్కారమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

## పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల కోసం 520 నూతన నియామకాలు

- ఏప్రిల్ లోగా ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం
- కాలేజీ, ఆసుపత్రుల భవనాల పనులు మే 15లోపు పూర్తి చేయాలి
- 2026-27 సంవత్సరంలో 100 ఎంబిబియస్ సీట్లతో ప్రవేశాల లక్ష్యం
- నియామకాలు, పనులు ప్రగతిని సమీక్షించిన మంత్రి
- బుధవారంనాడు నిర్మాణ పనులను పరిశీలించనున్న కార్యదర్శి



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : పిడుగురాళ్లలోని కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో 100 ఎంబిబియస్ సీట్లకు ప్రవేశాలు కల్పించే దిశగా అవసరమైన అన్ని పనులను మే 15లోగా పూర్తి చేయాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సీనియర్ అధికారులను ఆదేశించారు. ఈ దిశగా జరుగుతున్న చర్యల ప్రగతిని సచివాలయం నుంచి హాజరైన మంత్రిత్వ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, డిఎంఇ డాక్టర్ రఘునందన్, ఎపిఎంఎస్‌ఐడిసి,

మిగతా 3లో...

## పారిశ్రామిక వేత్తల్లో విశ్వాసం నింపేలా ఏపీ ప్రభుత్వ విధానాలు

- సీఎం చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా పారిశ్రామిక ప్రగతికి ఆర్సెలార్ తోడ్పాటు
- AM-NS ఇండియా ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్
- నక్కపల్లి ఉక్కు ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి: ఆదిత్య మిట్టల్




అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా పారిశ్రామిక ప్రగతికి ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ తోడ్పడుతుందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్ అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో సోమవారం ఆర్సెలార్ AM-NS ఇండియా ప్లాంటుకు శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. 'ఏపీలో ఓ భారీ స్థాయి స్టీల్ పరిశ్రమ ఏర్పాటుకు అంకురార్పణ చేశాం. ఈ ఏడాది తర్వాత 20 వార్షికోత్సవం నిర్వహించుకుంటున్న ఆర్సెలార్ మిట్టల్ సంస్థకు

మిగతా 3లో...

# ముస్లిం బాలికల చదువుల కోసం ఎమ్మెల్సీ ఆలపాటి ఆర్థిక సాయం



(మొదటి పేజీ తరువాయి)

కుధ్ధూస్, మదర్సా పెద్దలకు అందజేశారు.

ఈ సందర్భంగా ఖుద్దూస్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి గత 18 ఏళ్లుగా ప్రతి ఏటా తెనాలి మదర్సా కు లక్ష రూపాయలు విరాళం అందజేస్తున్నారని అన్నారు. ఆమాట ప్రకారం ఈ సంవత్సరం రంజన్ రోజున రాలేకపోయినా, ఈరోజున లక్ష రూపాయలు చెక్ పంపడం జరిగిందని, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు, మదర్సా తరపున ధన్యవాదాలు తెలిపారు ఆ అల్లాహ్ దయ, తమ నాయకుడికి, కుటుంబ సభ్యులకునిరంతరం ఉండాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ మొహిద్దీన్,పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని,టీడీపీ నేతలు షేక్ నాసర్, షేక్ మస్తాన్,నాగూర్,పఠాన్ ఫిరోజ్ ఖాన్, సుభాని, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 6 నుంచి బీజేపీ 'మన ఊరు - మన జెండా'



(మొదటి పేజీ తరువాయి)

జాతీయవాద రాజకీయ ప్రయాణం 75 ఏళ్ల మైలురాయిని చేరుకుందని తెలిపారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన ఏప్రిల్ 6న రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, మొదటి విడతగా ఆరు నెలల పాటు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, ఎల్ఇడి వీధి దీపాలు, గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్మశాన వాటికల అభివృద్ధికి కేంద్రం చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.

సంక్షేమ పథకాలపై కూడా విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. గ్రామీణ గృహనిర్మాణం, జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటి కనెక్షన్లు, ఉజ్వల యోజన గ్యాస్ పంపిణీ, గరీబ్ కళ్యాణ్ యోజన కింద ఉచిత ధాన్య పంపిణీ, ఆరోగ్య కార్డులు వంటి పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు.

ఏపీలో కూటమి ప్రభుత్వ భాగస్వామిగా గ్రామీణ అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కొనసాగిస్తామని, ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేస్తాయని అన్నారు.

ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడంతో పాటు 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని, 'వికసిత గ్రామం - వికసిత ఏపీ - వికసిత భారత్' లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు 'మన ఊరు – మన జెండా' కన్వీనర్ మట్టా ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి రామాంజనేయ చౌదరి, అడారి ఆనంద్, సందిరెడ్డి శ్రీనివాసులు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# హామీ నెరవేర్చా.. శెట్టి బలిజలకు అండగా ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో బీసీలను.. ముఖ్యంగా శెట్టిబలిజలను టార్గెట్ చేసి వేధించారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో తనను కలిసిన శెట్టిబలిజ సోదరులు.. దొమ్మేటి జయంతిని రాష్ట్ర పండుగగా చేయాలని కోరారని, ప్రజా ప్రభుత్వంలో వారికిచ్చిన మాటను నిలబెట్టుకున్నానని తెలిపారు. నేడు దొమ్మేటి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు.

బ్రిటిష్ వారి పాలనలో సాధారణ వ్యక్తిగా బర్మాకు వలస వెళ్లిన ఆయన.. షిప్పింగ్ వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగారన్నారు. అక్కడే బర్మా మేయర్ గా సేవలందించారని గుర్తు చేసుకున్నారు. శెట్టిబలిజల కష్టాలను చూసి.. వారిలో చైతన్యాన్ని నింపేందుకు శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. పిల్లల కోసం స్కూళ్లు, నైట్ స్కూళ్లు ప్రారంభించారని తెలిపారు. ఆ తర్వాత ఇండియాకు తిరిగివచ్చి బోడసకుర్రు జమీందార్ గా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని, అంతేకాక స్కూళ్లు, కాలేజీలు, లైబ్రరీల కోసం తన సొంతభూములు, నిధులు విరాళాలుగా ఇచ్చారని గుర్తుచేశారు. రానున్న ఆరునెలల్లో బోడసకుర్రులో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, శెట్టిబలిజల కోసం రాష్ట్రమంతటా కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామని నారా లోకేష్ ప్రకటించారు. అలాగే బోడసకుర్రు బ్రిడ్జికి దొమ్మేటి పేరు పెట్టే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# దేశంలో సరిపడా ఇంధన నిల్వలు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ప్రస్తుతం 54 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం మనకు సరిపడా నిల్వలు ఉన్నాయని; ముడిచమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మన నౌకలు సురక్షితంగా భారత్ చేరేలా జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలుపుతున్నామని అన్నారు.

ఇక మరోవైపు రైల్వేలో విద్యుదీకరణ వల్ల డీజిల్ వినియోగం బాగా తగ్గిందన్నారు. దేశవ్యాప్తంగా ఈవీ బస్సులు, ఇతర వాహనాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈవీ వాహనాలు భవిష్యత్తులో మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటామని ప్రధాని మోడీ అన్నారు. ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా దాని ప్రభావం భారత్‌పై పడుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆ ప్రభావం దేశంపై పడకుండా మనం స్వయం సమృద్ధి సాధించాలన్నారు.

# చంద్రబాబు అనే నేను చెబుతున్నా... దేశంలో పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్

(మొదటి పేజీ తరువాయి)

రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. రూ.1.35 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సంస్థకు జాతీయ స్థాయిలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా చాలా మంచి పేరుంది. ఇలాంటి సంస్థ ఏపీకి రావడం చాలా మంచి పరిణామం. అందుకే చెబుతున్నాను... ఇవాళ జరిగిన శంకుస్థాపన స్టీల్ ప్లాంట్ కోసం మాత్రమే కాదు... స్టీల్ సిటీకి జరిగిన శంకుస్థాపన. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మాణం జరుగుతుంది. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్టర్ ఫర్నెస్, డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నెస్ నిర్మాణం పూర్తి చేస్తారు. అలాగే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ 4 లేన్ల రహదారి కూడా పూర్తి అవుతుంది. పరిశ్రమకు ముడి ఇనుము సరఫరా కోసం పైప్ లైన్ కూడా వేయబోతున్నారు. ఈ ప్లాంట్ కోసం పైప్ లైన్ వేయాలని ప్రధానిని కోరితే వెంటనే అంగీకరించారు. ఉక్కు ఉత్పత్తి ఒక్కటే కాదు ఆర్థిక లావాదేవీలతో విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపు రేఖలు మారతాయి" అని సీఎం చంద్రబాబు చెప్పారు.



**అనుమతులు వేగంగా ఇస్తాం... అదే వేగంతో అభివృద్ధి చేయండి:** "ఈ పరిశ్రమకు ఇంత వేగంగా భూసేకరణ, అనుమతులను ఒక్క ఏపీలోనే ఇచ్చాం. చంద్రబాబు అను నేను చెబుతున్నాను... దేశంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతం ఆంధ్రప్రదేశ్. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, రాష్ట్రం ఉంది. నిపుణులు, మానవ వనరులు ఏపీకి మాత్రమే సొంతం. టూరిజం నుంచి డేటా సెంటర్ వరకూ, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకూ అన్నింటికీ ఏపీలో మెండైన అవకాశాలు ఉన్నాయి. కొత్త ఆలోచనలతో వచ్చి అవకాశాలను అందిపుచ్చుకోవాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే నినాదాన్ని విజయవంతం చేస్తాం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావటం దేశంలో ఇదే తొలిసారి. బీపీసీఎల్ సహా పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల్లోనే రాష్ట్రానికి 20.35 లక్షల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. విశాఖ ఎకనామిక్ రీజియన్ నాలెడ్జి ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీ సెంటర్లు ఇలా కీలకమైన కేంద్రంగా విశాఖ మారుతోంది. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి. రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా ఉత్తరాంధ్ర మారుతుంది. పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తాం. కొత్తగా పోర్టులు, ఎయిర్ పోర్టులు వస్తున్నాయి. ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తాం. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా నిర్మాణం పూర్తి చేసుకునేందుకు సహకారం ఇస్తాం. ఈ పరిశ్రమ నిర్మాణంలో రైతులు తమ భూములను త్యాగం చేశారు. వారికి సహకారం అందించాలి. ఉక్కు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు ధన్యవాదాలు. మొదటిగా అనకాపల్లి జిల్లా యువతకు ఈ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలి. ఆవిష్కరణల కోసం మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు అభినందనలు" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అభివృద్ధి చేస్తామని చెప్పాం... చేసి చూపిస్తున్నాం :** "ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే ఈ ప్రాజెక్టు సాకారమైంది. రాష్ట్రంపై ప్రధాని చూపిస్తున్న అభిమానానికి ఈ వేదిక పైనుంచి మరోసారి కృతజ్ఞతలు చెబుతున్నా. ప్రధాని మోదీ చెప్పిన జప్త్రఅజుా శీ ాప్త్రఅజుా తయారీ విధానానికి ఏపీ తిరుగులేని వేదిక. ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో నేడు ఈ పరిశ్రమ రాష్ట్రానికి వచ్చింది. డబుల్ ఇంజన్ సర్కార్ విజయం ఇది. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేస్తామని... నేను, పవన్ కళ్యాణ్ చెప్పాం. అభివృద్ధి–సంక్షేమం–సుపరిపాలన చేసి చూపిస్తున్నాం. ఏ పని తలపెట్టినా సంపూర్ణ మద్దతు ఇస్తున్న పవన్ కళ్యాణ్‌ను అభినందిస్తున్నా. మంత్రి లోకేష్ పరిశ్రమలు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు."అని సీఎం చెప్పారు.

**నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఒప్పందం :** యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పన, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వంతో రెండు వేర్వేరు ఒప్పందాలను ఆర్సెలార్ మిట్టల్– నిప్పన్ స్టీల్ సంస్థ చేసుకున్నాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు నైపుణ్యాలు కల్పించేలా ఒక ఒప్పందం, ఆధునిక ఉత్పత్తి సామర్థ్యాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు మరో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అత్యాధునిక మెటలర్జికల్ ఇనిస్టిట్యూట్ ద్వారా యువతకు మెరుగైన నైపుణ్యం, తయారీ సామర్థ్యాలను కల్పిస్తామని ఆర్సెలార్ మిట్టల్ –నిప్పన్ స్టీల్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్ ప్రకటించారు.

**ఎక్స్ పీరియన్స్ జోన్ సందర్శన :** శంకుస్థాపన కార్యక్రమానికి ముందు అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియన్స్ జోన్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. సీఎంతోపాటు కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎక్స్ పీరియన్స్ జోన్ ను సందర్శించారు. ాపీ–చీ ఇండియా ప్లాంట్ కు సంబంధించిన వివరాలు, ఉక్కు రంగంలో ాపీ–చీ ఇండియా సంస్థ ప్రగతి వంటి అంశాలపై ప్రదర్శించిన వీడియోలను తిలకించారు. దశల వారీగా ఏర్పాటు చేయబోయే స్టీల్ ప్లాంట్ మినియేచర్ ను సీఎం, కేంద్ర మంత్రులు, డిప్యూటీ సీఎం, మంత్రులు తిలకించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ సీఎం రమేష్, అనకాపల్లి జిల్లా ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఆర్సెలార్ మిట్టర్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఆర్సెలార్ మిట్టల్ సీఈఓ ఆదిత్య మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్రతినిధులు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# పాలన బలంగా ఉంటేనే... పెట్టుబడులు బలంగా వస్తాయి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'గత ప్రభుత్వంలో రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి. ఇప్పుడు పెట్టుబడులు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నాయి. గత ఎన్నికల్లో నేను కోరుకున్న కూటమి నేడు ఉత్తరాంధ్ర ప్రాంతంలో లక్ష మందికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయి పెట్టుబడులు రావడానికి కారణమయ్యింద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. '2024లో రాష్ట్ర ప్రజలకు చెప్పిన మాట ఇదే.. రాష్ట్రం బలంగా ఉండాలి.. రాష్ట్రంలోకి పెట్టుబడులు రావాలి.. అలా జరగాలి అంటే రాష్ట్రంలో దార్శనికత ఉన్న పటిష్టమైన నాయకత్వం ఉండాలని చెప్పాను. ఇప్పుడు పెట్టుబడులు వస్తున్నాయి' అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపంలో అలాంటి నాయకత్వం రాష్ట్రంలో ఉండబట్టే దేశంలో 25 శాతం పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ కి వస్తున్నాయన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండల పరిధిలో ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో స్థాపించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, రాష్ట్ర ఐటి, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్, రాష్ట్ర, కేంద్ర మంత్రులతో కలసి పాల్గొన్నారు.



ఉక్కు కర్మాగారం భూమి పూజ అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండల పరిధిలో నిర్మిస్తున్న ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా రూ. 1.35 లక్షల కోట్లతో 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ భారీ కర్మాగారం ఉత్తరాంధ్ర ప్రాంత దశ దిశ మారిపోనున్నాయి. లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుంది. దేశంలోనే అత్యాధునిక సాంకేతికతతో ఏర్పాటు కానున్న ఈ గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ పరిమిత స్థాయి కర్బన ఉద్గారాలను విడుదల చేస్తుంది. రాష్ట్ర అభివృద్ధికి పరిశ్రమలు రావాలి. వచ్చే పరిశ్రమలు తక్కువ మోతాదులో కాలుష్యం వెదజల్లేవిగా ఉండాలన్నది నా ఆకాంక్ష. దాన్ని ఆచరణలో పెడుతున్న ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. ఎన్డీఏ కూటమి తరఫున ఈ సంస్థను రాష్ట్రంలోకి మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నాను.

**గత పాలకులు బెదిరింపులకు పాల్పడి పరిశ్రమల్ని పంపేశారు :** ఒక్క కియా పరిశ్రమతో అనంతపురం జిల్లా తీరు తెన్నులు పూర్తిగా మారిపోయాయి. ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఉద్యోగాలు వచ్చాయి. భూముల ధరలు పెరిగాయి. ఒక్క పరిశ్రమ వస్తే ఎన్ని మారిపోతాయో అనంతలో చూశాం. అలాంటిది రూ. 1.35 లక్షల కోట్ల పెట్టుబడితో స్టీల్ ప్లాంట్ వస్తే ఉత్తరాంధ్ర, అనకాపల్లి ప్రాంత దశ దిశ భవిష్యత్తు పూర్తిగా మారిపోతుంది.

గత పాలకులు ఉత్తరాంధ్ర ప్రాంతానికి వచ్చిన పరిశ్రమలను బెదిరించి పంపేశారు. కూటమి ప్రభుత్వంలో కేవలం 18 నెలల కాలంలో ఒక వీడియో కాన్ఫరెన్స్ తో మొదలై రూ. 1.35 లక్షల పరిశ్రమకు భూమి పూజ చేయడం స్పీడ్ ఆఫ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు నిలువెత్తు నిదర్శనం.

**రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకుంటూ పారిశ్రామిక వేత్తలకి సహకారం :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి సారించాం. పెట్టుడులకు సానుకూల వాతావరణాన్ని కల్పించాం. అదుపు తప్పిన శాంతిభద్రతలను పునరుద్ధరించాం. రంగాలవారీగా 25కి పైగా విధానాలు తీసుకువచ్చి వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకుంటూనే ప్రభుత్వం నుంచి అందించాల్సిన సహకారాన్ని అందిస్తున్నాం. తత్ఫలితంగా దేశంలోనే అతి పెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ లాంటి సంస్థ ఉత్తరాంధ్రని, విశాఖను వెతుక్కుంటూ వచ్చింది. అలాంటి వాతావరణం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన మిత్తల్‌కి అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలియజేస్తున్నాను" అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు , హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, టి.జి. భరత్, గుమ్మడి సంధ్యారాణి, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి.ఎం. రమేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్, వివిధ నియోజకవర్గాల శాసన సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# బ్రాండ్ సీబీఎన్ వల్లే రాష్ట్రానికి భారీ ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరాలు గడిచాయి. 2024లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాకు 94 శాతం స్ట్రైక్ రేట్ తో మరో అవకాశం ఇచ్చారు. మేం మళ్ళీ అధికారం చేపట్టిన వెంటనే, ఒక్క రోజు కూడా వృథా చేయకుండా వేగంగా ముందుకు సాగాం. 2024 సెప్టెంబర్ 22 ఆదివారం రాత్రి 8:30 గంటలకు అదిత్యతో మాట్లాడిన 30 నిమిషాల జూమ్ కాల్, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మార్చేసింది. ఆ కాల్ తో భారతదేశంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఇన్వెస్ట్‌మెంట్ పొందగలిగాం. ఇది ఆధునిక ఆంధ్రపదేశ్ లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు నిదర్శనం.

**ఆ తల్లిమాటలే 20లక్షల ఉద్యోగాల ప్రకటనకు ప్రేరణ :** ఆంధ్రప్రదేశ్‌లో నేను 2023వ సంవత్సరంలో యువగళం పేరుతో 3,132 కిలోమీటర్లు పాదయాత్ర చేశాను. ఆ పాదయాత్రలో లక్షలాది మందిని కలిశాను. ప్రతి సంభాషణ నా మనసులో చెరగని ముద్ర వేసింది. జీడి నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్నపుడు రోడ్డుపక్కన బజ్జీలు అమ్ముతున్న మోహన అనే మహిళను కలిశాను. ఆమె తన భర్త మద్యానికి బానిసై చనిపోయాడు. అప్పటినుంచి గత 30 సంవత్సరాలుగా నిర్విరామంగా పనిచేసి, తన ఇద్దరు కొడుకులకు మంచి చదువు చెప్పించింది. ఆమెతో మాట్లాడినప్పుడు, డబ్బు లేదా ఇతర సహాయం అడగలేదు. "ప్రభుత్వం నుంచి ఏమీ అవసరం లేదు... నా పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వండి" అని చెప్పింది. ఆమె మాటలు నాపై బలమైన ముద్ర వేశాయి. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని నేను చేసిన ప్రకటనకు ఆమె మాటలే ప్రేరణ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 20 నెలలు పూర్తయిన సమయంలో, ఈ భూమిపూజ నా జీవితంలో భావోద్వేగ ఘట్టం. ఆంధ్రప్రదేశ్ యువతకు నేను ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చుతున్నందుకు గర్వంగా ఉంది. ఈ భూమిపూజ అవిశ్రాంత కృషి, ధైర్యం, నమ్మకాలకి దక్కిన ఫలితం. మేము ఇప్పుడు దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీ పడుతున్నాము, భారతదేశంలో నంబర్ 1 ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్ గా ఏపీని మార్చాం.

**మా సామర్థ్యానికి మచ్చుతునక :** ప్రపంచస్థాయి కంపెనీలను ఆకర్షించి, రికార్డు సమయంలో ప్రాజెక్టులు మొదలుపెట్టే మా సామర్థ్యానికి ఇది మచ్చుతునక. ఏఎంఎన్ఎస్ స్టీల్ ప్లాంట్ మా రాష్ట్రానికి వస్తున్న ముఖ్య ప్రాజెక్టుల్లో ఒకటి. లేటెస్ట్ టెక్నాలజీ, హై–గ్రేడ్ స్టీల్‌పై స్పెషలైజేషన్ తో ఈ ప్రాజెక్ట్ అనకాపల్లిని ప్రపంచ మ్యాప్‌లో పెడుతుంది. ఏఎంఎన్ఎస్ గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను గ్రీన్ ఎనర్జీ, సస్టైనబుల్ టెక్నాలజీలతో అభివృద్ధి చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్ట్‌లో మేం సాధించిన కొన్ని టైమ్‌లైన్‌లు చెప్పాలి. సెప్టెంబర్ 2024లో అదిత్యతో మొదటి జూమ్ కాల్. 2 నెలల్లో ప్రాజెక్టు, ఇన్సెంటివ్స్ అప్రూవ్. 3 నెలల్లో భూమి ఇచ్చాం. ఎన్విరాన్ మెంట్, ఫారెస్ట్ క్లియరెన్స్ 11 నెలల్లో వచ్చాయి. ఇవి ప్రపంచ స్థాయి టైమ్‌లైన్‌లు – ఇది రికార్డు స్థాయి బిజినెస్ వేగం. భారతదేశంలో ఇంతటి భారీ స్కేల్ ప్రాజెక్టును అత్యంత వేగంగా సాధించినందుకు గర్వంగా ఉంది. ఇది 17.8 వీఘీఖూా ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, ?1.35 లక్షల కోట్ల ఇన్వెస్ట్‌మెంట్, లక్ష ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు, ప్లస్ క్యాప్టివ్ పోర్ట్‌తో అదనంగా 11వేల కోట్లకు పైగా ఇన్వెస్ట్‌మెంట్.




**బ్రాండ్ సీబీఎన్ పై నమ్మకంతోనే రాకలి:** ఈరోజు, ఈ ప్రాజెక్టు ఇక్కడికి రావడానికి కారణం ఇన్సెంటివ్స్, భూమి, పాలసీలు కాదు...బ్రాండ్ సీబీఎన్. దశాబ్దాలపాటు ఆయన నిర్మించిన నమ్మకం. 2025 దావోస్ లో అదిత్య మిట్టల్ చెప్పాడు: "ఇది గణాంకాల గురించి కాదు. సీబీఎన్ పైన, ఆయన నాయకత్వం పైన, స్థిరమైన అభివృద్ధి సాధనమైన నమ్మకం. అది సీబీఎన్ బ్రాండ్. దశాబ్దాలుగా క్రెడిబిలిటీ నిర్మించిన నాయకుడు. ప్రపంచ ఇన్వెస్టర్లు నమ్మే నేత. ఇది కేవలం హామీల వల్ల కాదు, సామర్థ్యం వల్లే సాధ్యం. నమ్మకంతో పాటు, అలైన్‌మెంట్, పార్ట్‌నర్‌షిప్ కూడా అవసరం.

**డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ వేగానికి సూచిక :** గౌరవనీయ ప్రధాని నరేంద్ర మోదీగారి దూరదృష్టి, సమర్థ నాయకత్వంలో భారతదేశం ట్రాన్స్‌ఫర్మేషనల్ గ్రోత్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్‌కి బలమైన పాలసీ మద్దతునిస్తోంది. నాకు అసాధారణ సపోర్టు అందించిన గౌరవనీయ స్టీల్ మంత్రి హెచ్.డి. కుమారస్వామి గారికి కృతజ్ఞతలు. ఈ ప్రాజెక్టుకు పలు సవాళ్లు ఎదురైనప్పుడు -- చీవీణజ కోఆర్డినేషన్, స్లర్రీ పైప్‌లైన్, క్లియరెన్స్‌లు వంటి వాటిని ముఖ్యమంత్రి పర్సనల్‌గా శ్రద్ధ తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, పీఎంవోతో సమన్వయం చేసి సాధించారు. ప్రధాని నరేంద్ర మోడీజీ, కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామి గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. స్టీల్ ఎకో సిస్టమ్ అభివృద్ధికి ఇది ప్రారంభం మాత్రమే. ఇది కేవలం సహకారం మాత్రమే కాదు, డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ వేగాన్ని సూచిస్తోంది. ఏపీ ప్రజల వల్లే ఇది సాధ్యమైంది. 25 మంది ఎంపీల్లో 21 మంది ఎంపీలను గెలిపించారు. ఈ ప్రాజెక్టు కేవలం ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ కాదు, ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చే మరపురాని ఘట్టం. ఫార్మా, ఐటి కంపెనీలు, డేటా సెంటర్లకు ఉత్తరాంధ్ర నిలయంగా మారుతోంది. ఇప్పుడు భారతదేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఇక్కడ ఆవిష్కృతం అయింది.

**అభివృద్ధి వికేంద్రీకరణ, సమగ్రాభివృద్ధి మా ధ్యేయం :** ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి వికేంద్రీకరణ, అన్నిప్రాంతాల సమగ్రాభివృద్ధి మా ధ్యేయం. ఆంధ్రప్రదేశ్ పై నమ్మకంతో భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చిన లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్ కు మా ధన్యవాదాలు. హై స్కేల్ ఇన్వెస్ట్‌మెంట్లు కేవలం ఆర్థికపరమైన నిర్ణయాలు కావు, విశ్వసనీయత, నమ్మకంతో కూడుకున్నవి. మాకు మద్దతుగా ఏఎంఎన్ఎస్ ఇండియా సీఈవో దిలీప్ ఒమన్ గారికి కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నా. హోంమంత్రి అనితకి కూడా ధన్యవాదాలు. గట్టిగా నిలబడ్డారు. నేను ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించి అండగా నిలబడతాను, మా ప్రాంతానికి ఒక్క స్టీల్ ప్లాంట్ తీసుకురావాలని నా వెనుక ఉండి నడిపించారు. ఈ భూమిపూజ స్థలంలో నిలబడి మేము ఒకటి నిరూపిస్తున్నాము. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పుడు ఎంవోయూలపై సంతకాలు చేయడమే కాదు, వాటిని విజయవంతంగా గ్రౌండ్ చేస్తాం. ప్రాజెక్టులు ప్రకటించడం మాత్రమే కాదు, నిర్మిస్తాం. పెట్టుబడులు ఆకర్షించడమే కాదు, ఫలితాలు సాధిస్తాం.

**యువతకు ఉద్యోగాల కల్పనే మా ఎజెండా :** మా ప్రభుత్వానిది ఒకే స్పష్టమైన అజెండా. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన. మేము తెచ్చే ప్రతి పాలసీ, ప్రతి ఇన్వెస్ట్‌మెంట్, ప్రతి రిఫార్మ్ ఉద్యోగాల సాధనకే. యువత ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగానే మా నిర్ణయాలు ఉంటాయి. మా పాలసీలు యువత కలలను సాకారం చేస్తాయి. మేము రాష్ట్రంలో సెక్టార్–బేస్డ్ క్లస్టర్ మోడల్ తో అభివృద్ధికి బాటలు వేస్తున్నాం. ప్రతి రీజియన్ స్థిరమైన అభివృద్ధి సాధిస్తూ స్కేలబుల్ ఉద్యోగాలు సృష్టిస్తుంది. మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, ఐటీ హబ్‌లు, ఫార్మా జోన్‌లు, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు... ఇలా 22 క్లస్టర్లు జాబ్ ఇంజిన్‌గా పనిచేస్తాయి. ఇదే ఆంధ్రప్రదేశ్‌లో అనుసరించే డీసెంట్రలైజ్డ్ డెవలప్‌మెంట్, ఇన్‌క్లూసివ్ గ్రోత్ విధానం.

మేము కేవలం ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, యువతకు మంచి కెరీర్, జీవనోపాధి, భవిష్యత్తును ఇస్తున్నాం. ఇది భారతదేశ అభివృద్ధి మంత్రం. మ్యానుఫ్యాక్చరింగ్ ఇన్వెస్ట్‌మెంట్లు వేగవంతం చేసి, మిలియన్ల యువతకు ఉపాధి కల్పిస్తాం. ఇలాంటి సక్సెస్ స్టోరీలు భారతదేశాన్ని ప్రపంచ మ్యానుఫ్యాక్చరింగ్ క్యాపిటల్ గా మారుస్తాయి. వేగం ఎంచుకునే కంపెనీలు, ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంటాయి. అదిత్య మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు. ఆదిత్య మిట్టల్‌గారిని ఒకటే కోరుతున్నా. వచ్చే మూడేళ్లలో ఏపీలో లక్ష ఉద్యోగాలు నిరుద్యోగ యువతీ, యువకులకు కల్పించాలి. ప్రత్యేకంగా ఇక్కడున్న రైతులకు నా హృదయపూర్వక నమస్కారాలు. మీరు చేసిన త్యాగం వల్లే ఇక్కడ ఈ రోజు ఈ స్టీల్ ప్లాంట్ వచ్చింది. గతంలో విశాఖ ఉక్కు కోసం చాలామంది పోరాడారు. కానీ మీ మనోభావాల ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు గారు మన ప్రాంతానికి ఒక అద్భుతమైన ఉక్కు పరిశ్రమను తీసుకువచ్చారని మంత్రి పేర్కొన్నారు.

# ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మారేలా యాక్షన్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

దీనికి పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ), విద్యుత్ పరికరాల వినియోగం పెరిగేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికీ పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాలతో తలెత్తిన పంట నష్టంపై సోమవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణ కోసం 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ 60 వేల మంది వినియోగదారులు మాత్రమే కనెక్షన్లు పొందారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే దీనిని 100 శాతం వినియోగించుకునేలా చూడటంతో పాటు, జిల్లాకు కనీసం 10 వేలకు తగ్గకుండా నూతన కనెక్షన్లు ఇవ్వాలంటూ సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. శ్రీకాకుళం - కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణపై కేంద్ర మంత్రికి లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్‌కు వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వచ్చే కేబినెట్ సమావేశానికి 'నేచురల్ గ్యాస్ పాలసీ ఫర్ ప్రమోషన్ ఇన్ కమర్షియల్ సెక్టార్' విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. గ్యాస్ సంక్షోభం విద్యుత్ రంగానికి ఒక అవకాశమని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు వంటివి ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించేలా చూడాలన్నారు. విద్యా సంస్థలకు, ఆస్పత్రులు, అంగన్వాడీలు, అన్న క్యాంటిన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగేలా చూడాలన్నారు. మరోవైపు గత ఐదు రోజులుగా గృహావసరాల కోసం రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. అటు అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో సంభవించిన పంట నష్టం ప్రాథమిక వివరాలపైనా ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు.



ఈ నెల 26వ తేదీ కల్లా పంట నష్టం అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వ్యవసాయంలో జీఎస్డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరగడంతో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలన్నారు.

**ఏఐ సాయంతో తిరుమలలో పెరిగిన దర్శనాలు :** టెక్నాలజీ వినియోగించడంతో అన్నింటా మంచి ఫలితాలు వస్తున్నాయని... దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యనే నిదర్శనమని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. ఏఐ సాయంతో తిరుమలలో క్యూలైన్లు, భక్తుల రద్దీ... నిర్వహణ వల్ల నిరీక్షణ సమయం తగ్గిందని, దీంతో 20 శాతం వరకు భక్తులు అదనంగా దర్శనాలు చేసుకునే అవకాశం లభించిందన్నారు. ఇప్పుడు కొండపై ప్రసాదం బావుంది, దర్శనం బావుంది, శ్రీవారి సేవకులు, భక్తుల్లో సంతృప్తి పెరిగిందని అన్నారు. అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ద్వారా తిరుమల ప్రసాదాల్లో న్యూట్రిషనల్ విలువలు, పదార్థాల క్వాలిటీ చెక్ చేస్తున్నామని, దీంతో భవిష్యత్‌లో కల్తీకి ఆస్కారం ఉండదని సీఎం అన్నారు. ఇదే తరహాలో మిగిలిన శాఖలు మెరుగైన ప్రజా సేవలకు ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీ టీవీ లాంటి వివరాలతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. డ్రోన్ల వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెరిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. పొరుగు రాష్ట్రాల్లో డ్రోన్ల వినియోగంపైనా అధ్యయనం జరపాలన్నారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ శాఖలు అవేర్, డేటా వినియోగం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించేలా చూడటం కీలకమన్నారు. ఈ సమావేశానికి మంత్రులు కొలుసు పార్థ సారథి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

## పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల కోసం 520 నూతన నియామకాలు




(మొదటి పేజీ తరువాయి)


ఇతర విభాగాల ఉన్నతాధికారులతో సోమవారంనాడు వర్చువల్‌గా మంత్రి సమగ్రంగా సమీక్షించారు.

పిడుగురాళ్ల వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించిన నేపథ్యంలో 2026-27లో ప్రవేశాలు కల్పించే దిశగా మంత్రిత్వ శాఖ పనులను శీఘ్రతరం చేసింది. కేంద్ర ప్రాయోజిత పథకం కింద నిర్మిస్తున్న ఈ కాలేజీ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 195 కోట్లు మంజూరు చేసింది. రూ. 450 కోట్ల ఆమోదిత వ్యయంతో 47 ఎకరాల విస్తీర్ణంలో ఈ కాలేజీ నిర్మాణ పనులు సాగుతున్నాయి.

**కొత్త నియామకాలు :** పిడుగురాళ్ల వైద్య కళాశాలలో 100 ఎంబిబియస్ ప్రవేశాలకు ఎన్ఎంసి ప్రమాణాల మేరకు డాక్టర్లతో సహా దాదాపు 700 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఇందులో భాగంగా బదిలీలు, పదోన్నతులు, రీడిప్లాయిమెంట్ ద్వారా దాదాపు 180 మందిని నియమించడానికి మంత్రిత్వ శాఖ ఇప్పటికే నిర్ణయించింది. దీనికి అదనంగా మరో 520 ప్రభుత్వ నియామకాలను వివిధ కేటగిరీల్లో చేయాల్సి ఉంది. ఈ దిశగా చేపట్టిన చర్యల్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించారు. వివిధ దశల్లో ఉన్న ఈ నియామక ప్రక్రియను ఏప్రిల్ మాసాంతానికి పూర్తి చేయాలని మంత్రి ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. కొత్తగా ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు 45 కేటగిరీల్లో సహాయక సిబ్బందిని నియమించాలి.

**మే 15 నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలి :** వైద్య కళాశాల, అనుబంధ బోధానాసుపత్రి, నర్సింగ్ కళాశాల, విద్యార్థుల వసతి గృహాల నిర్మాణ పనులను కూడా మంత్రి సమీక్షించి, మిగిలిన పనులను మే 15 కల్లా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పిడుగురాళ్ల వైద్య కళాశాలను సందర్శించి ఈ నిర్మాణ కార్యక్రమాల తీరు, ప్రగతిని అంచనా వేసి స్పష్టమైన ఆదేశాలివ్వాలని కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు మంత్రి సూచించారు. ఈ మేరకు సౌరభ్ గౌర్ నేతృత్వంలోని అధికారుల బృందం బుధవారంనాడు కాలేజీని సందర్శించనుంది.

## నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎస్ఆర్ఎం విద్యార్థులు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** మంగుళూరులో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకూ జరిగే సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్- 2026 పోటీలకు ఇద్దరు ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులు ఎంపికయ్యారు. యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్న చాతుర్య , ప్రదీప్ కుమార్ లు 76, 59 కేజీల కేటగిరిలో పవర్ లిఫ్టింగ్ పోటీలకు హాజరవుతున్నారు. మన రాష్ట్రం నుంచి ఈ పోటీలకు ఎంపికైన పవర్ లిఫ్టర్లు వీరిద్దరే కావడం విశేషం.

షవర్ లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో సీనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు మంగళూరులోని టీవీ రామన్ పై కన్వెన్షన్ సెంటర్లో జరుగనున్నాయి. ఈ నెల 28 వరకూ జరిగే ఈ జాతీయ స్థాయి పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి పవర్ లిఫ్టర్లు పాల్గొంటున్నారు. గత మూడేళ్లుగా యూనివర్సిటీ కోచ్ సలోమి దగ్గర శిక్షణ పొందుతున్న విద్యార్థిని చాతుర్య 2025 మే నెలలో కొల్హాపూర్ కేంద్రంగా జరిగిన జాతీయ స్థాయి జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు హాజరై రజిత పతకాన్ని కైవసం చేసుకుంది. అదేవిదంగా కిందటి నెల రాజమండ్రిలో జరిగిన 13వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రదీప్, వాతు ర్యలు ఇద్దరూ గోల్డ్ మెడల్ను దక్కించుకున్నారు.

## గొప్ప సంఘ సంస్కర్త 'దొమ్మేటి'



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):** శెట్టి బలిజల పితామహుడు బొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన సేవలు నేటి యువతకు ఎంతో ఆదర్శమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత కొనియాడారు. మహాత్మా గాంధీ కంటే ముందే వయోజన విద్య కోసం కృషి చేసిన మేధావన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభివృద్ధికి, శెట్టిబలిజ సమాజ అభ్యున్నతికి, విద్యకు కృషి చేసిన మహానీయుడన్నారు. 1853 మార్చి 23న జన్మించిన దొమ్మేటి వెంకరెడ్డి వయోజన విద్య వ్యాప్తికి విశేష కృషి చేశారన్నారు. 1905లో బర్మాలో శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, ఆ సంఘం ద్వారా దేశంలో ప్రాథమిక పాఠశాలలు, గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలను నెలకొల్పారన్నారు. అనంతరం కోనసీమలో కూడా శెట్టి బలిజల ఐక్యతకు, వయోజన విద్యకు కృషి చేశారన్నారు. ఆనాటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలోనూ తనవంతు పాత్ర పోషించారన్నారు. తుది శ్వాస విడిచిపెట్టే వరకూ శెట్టిబలిజల ఐక్యతకు, వారి అభ్యున్నతికి పాటు పడ్డారన్నారు. వెంకటరెడ్డి పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎందో ఆదర్శమన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు బీసీలు, శెట్టి బలిజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ, శెట్టి బలిజల పితామహుడు బొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, శెట్టి బలిజ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్తల్లో విశ్వాసం నింపేలా ఏపీ ప్రభుత్వ విధానాలు

(మొదటి పేజీ తరువాయి)




ఈ ప్లాంట్ ఓ కలికి తురాయి అవుతుంది. నేను జన్మించిన నా భారత దేశంలో ఈ స్థాయిలో పెట్టుబడులు పెట్టి ప్రపంచ స్థాయి ప్రమాణాలతో స్టీల్ ప్లాంట్ నిర్మిస్తున్నాం. ప్రధాని నరేంద్రమోదీ రూపకల్పన చేసిన ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ కార్యక్రమంలో ఇది ఆరంభం మాత్రమే. పారిశ్రామిక వేత్తల్లో విశ్వాసం నింపేలా ఏపీలోని విధానాలు ఉన్నాయి. మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి పరిశ్రమలు, రక్షణ రంగ ఉత్పత్తులు ఇలా వేర్వేరు రంగాలకు అవసరమైన స్టీల్ ఉత్పత్తులు తయారవుతాయి. ఏడాదికి 8 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో దేశ అవసరాలకు అనుగుణంగా ఈ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ కు అనుగుణంగా పారిశ్రామిక ప్రగతికి ఈ ప్లాంట్ తోడ్పడుతుంది. ఈ పరిశ్రమ లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి ఉద్యోగాలను కల్పిస్తుంది. యువతకు నైపుణ్య శిక్షణ కూడా కల్పిస్తుంది. ఈ ప్రాజెక్టు వల్ల అనకాపల్లి ఉపాధి కేంద్రంగా... గ్రోత్ ఇంజన్ గా మారుతుంది. మేం తొలి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఇప్పటికి 50 ఏళ్లు పూర్తైంది. అనకాపల్లిలో ఏర్పాటు చేసే ప్లాంట్ అత్యాధునిక స్టీల్ ప్లాంట్ గా నిలిచిపోతుంది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ఈ పరిశ్రమలో స్టీల్ ఉత్పత్తి చేస్తాం. ఈ ఉక్కు పరిశ్రమ సాకారానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. భారత ప్రగతికి ఈ భారీ పరిశ్రమల కీలకంగా మారుతుంది.' అని లక్ష్మీ ఎన్ మిట్టల్ వ్యాఖ్యానించారు.

**ఏపీపై ఉన్న నమ్మకంతోనే అతిపెద్ద పరిశ్రమ ఏర్పాటు: ఆదిత్య మిట్టల్ :** ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటులో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం స్పష్టంగా కనిపించిందని ఆ సంస్థ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్ అన్నారు. శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ఆదిత్య మిట్టల్ మాట్లాడుతూ... 'స్పష్టమైన విధానాలు ఉంటే ఎంత వేగంగా పనులు సాకారం అవుతాయో ఏపీ నిరూపించింది. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడులకు ఏపీపై ఉన్న నమ్మకానికి ఈ పరిశ్రమ అతిపెద్ద ఉదాహరణ. ఈ పరిశ్రమ ద్వారా లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించిన ప్రభుత్వానికి, రైతులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. విశాఖలోని ప్లాంట్ నుంచి ముడి ఇనుము ఖనిజ సరఫరా పైప్ లైన్ అనకాపల్లి వరకూ విస్తరిస్తాం. ఇక్కడ తయారైన ఉక్కు ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేస్తాం. దేశీయ అవసరాలకు సరఫరా చేస్తాం. జాతీయ ఉక్కు విధానంలో భాగంగా జాతీయ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ ప్లాంట్ కీలకమవుతుంది. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల కల్పనకు 2 ఎంఓయూలను కూడా కుదుర్చుకున్నాం. మెటలర్జికల్ రంగంలో కోర్సుల కోసం ఓ ప్రత్యేక ఇనిస్టిట్యూట్ ను ఏర్పాటు చేయబోతున్నాం. నక్కపల్లిలో ఏర్పాటు చేయబోతున్న పరిశ్రమలో ప్రపంచ స్థాయి భద్రతా ప్రమాణాలు ఉంటాయని హామీ ఇస్తున్నాను' అని తెలిపారు.

## రూ.50 లక్షలతో వట్టిచెరుకూరు చెరువు అభివృద్ధి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** వట్టిచెరుకూరు ఊర చెరువు అభివృద్ధి పనులను రూ. 50 లక్షలతో చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. చెరువు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరికీ నీరు భావనతో అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కృషి సంచయి యోజన కింద పనులను రూ. 50 లక్షలతో మంజూరు చేశారు. ఊర చెరువును ఆహ్లాదంగా, సుందరంగా తయారు చేయడం జరుగుతుంది. చిన్నారులు ఆడుకునే విధంగా పరికరాలు ఏర్పాటు, పెద్దలు కూర్చొని సంతోషంగా గడుపుటకు బల్లలు ఏర్పాటు, గట్టు చుట్టూ మొక్కలు ఏర్పాటు, వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తూ ఒక చక్కటి ఆహ్లాదకరమైన పిక్నిక్ స్పాట్ మాదిరిగా తయారు చేయుటకు పండ్లు చేపట్టడం జరుగుతుంది. ఊర చెరువుతోపాటు చుట్టుప్రక్కల దాదాపు వంద ఎకరాల్లో చిన్న చిన్న చెరువులు ఉన్నాయి. ప్రధానంగా ఊర చెరువులో 14 ఎకరాలుగా ఉన్న ఒక భాగాన్ని, 7 ఎకరాలుగా ఉన్న మరో భాగాన్ని తీసుకుని అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఊర చెరువుకు అప్పాపురం ఛానల్ నుండి గ్రావిటీ ద్వారా నీరు నిత్యం చెరువులోకి పారటం మరొక ప్రయోజనకర అంశం.

చెరువును పరిరక్షించుకుంటున్న విధానాన్ని, కూడికలు తీసి అభివృద్ధి చేసుకుంటున్నా వివరాలను గ్రామస్తులు జిల్లా కలెక్టర్కు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ చెరువును జగ్గా వినియోగించుకోవాలని సూచించారు ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగిన విధంగా గ్రామస్తులు చర్యలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.

**మహిళలు గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి**

మహిళలు గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. మహిళలతో ముఖాముఖి మాట్లాడుతూ అక్షర ఆంధ్ర కార్యక్రమం, మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్), స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని ఇంటికి ఇల్లాలు అక్షర ద్వీపం వెలిగించాలని సూచించారు. మనమిత్ర - వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అవసరమగు సర్టిఫికెట్లు పొందవచ్చని, సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళవచ్చని దీన్ని పెద్ద ఎత్తున ఉపయోగించుకోవాలని కోరారు. స్వయం సహాయక సఘాల మహిళలు తమ సమావేశ నిర్వహించుటకు భవనం మంజూరు చేయాలని కోరగా చర్యలు చేపడతామని చెప్పారు. పర్యటనలో భాగంగా తాసిల్దార్ కార్యాలయం, స్వర్ణ గ్రామ కార్యాలయంను సందర్శించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి శంకర్, వట్టి చెరుకూరు మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేరళంలో బీజేపీ భారీ విజయం ఖాయం





- **అరణ్ములలో కుమ్మనం రాజశేఖరన్ నామినేషన్‌కు భారీ స్పందన**
- **కేరళంలో మార్పుకు నాంది పలుకుతున్న ఎన్నికలు**
- **వల్లూరు జయప్రకాష్ నారాయణ**

**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్):** కేరళం అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పుకు నాంది పలుకుతున్నాయని, ఈసారి బీజేపీ భారీ విజయాన్ని నమోదు చేయడం ఖాయమని అరణ్ముల అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ వల్లూరు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. అరణ్ముల నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ గవర్నర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కుమ్మనం రాజశేఖరన్ నామినేషన్ దాఖలు కార్యక్రమం సోమవారం భారీ ఎత్తున నిర్వహించబడింది.

ఈ నామినేషన్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులతో పాటు ప్రజలు తరలివచ్చి పాల్గొనడం కేరళం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గం మొత్తం ఉత్సాహభరిత వాతావరణం నెలకొనగా, పార్టీ కార్యకర్తల్లో నూతన జోష్ కనిపించింది.

ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ, కేరళంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న కుచిత రాజకీయాలకు ప్రజలు విసుగు చెందారని అన్నారు. అభివృద్ధి, సుశాసనం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చే బీజేపీకి కేరళం ప్రజలు స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుండగా, అదే మార్గంలో కేరళను తీసుకెళ్లాలనే ఆశయంతో ప్రజలు బీజేపీకి మద్దతు తెలుపుతున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బీజేపీపై విశ్వాసం పెరుగుతోందని చెప్పారు.

ఈ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి, దేశహితం, స్థిరమైన పాలన కోసం బీజేపీకి చారిత్రాత్మక మద్దతు ఇస్తారని, అరణ్ములలో కనిపిస్తున్న స్పందన రాష్ట్రవ్యాప్తంగా విజయానికి నాంది పలుకుతోందని జయప్రకాష్ నారాయణ విశ్వాసం వ్యక్తం చేశారు.

## అహికోడ్‌లో ఘనంగా బీజేపీ అభ్యర్థి కె.కె. వినోద్‌కుమార్ నామినేషన్





**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** కేరళం రాష్ట్రంలోని అహికోడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థి కె.కె. వినోద్‌కుమార్ నామినేషన్ దాఖలు కార్యక్రమం సోమవారం భారీగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. వందలాది బీజేపీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్న ఈ కార్యక్రమం అహికోడ్‌లో పండుగ వాతావరణాన్ని తలపించింది.

నామినేషన్ కార్యక్రమానికి ముందు భారీ ర్యాలీ నిర్వహించగా, కె.కె. వినోద్‌కుమార్ ఏనుగు అంబారిపై ఆశీనులై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అశేష జనవాహినితో నిండిన ఈ ర్యాలీ జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం వరకు కొనసాగింది. మార్గమధ్యంలో ప్రజలు పూల వం-షం కురిపిస్తూ అభ్యర్థికి స్వాగతం పలికారు.

తదుపరి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకున్న వినోద్‌కుమార్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు అబ్దుల్లాకుట్టి, అహికోడ్ అసెంబ్లీ ఇంచార్జ్ తాడువాయి రామకృష్ణ మరియు ఇతర నాయకుల సమక్షంలో అధికారికంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

ఈ సందర్భంగా నేషనల్ మీడియాతో మాట్లాడిన అహికోడ్ అసెంబ్లీ ఇంచార్జ్ తాడువాయి రామకృష్ణ మాట్లాడుతూ, అహికోడ్ నియోజకవర్గంలో బీజేపీకి అ-పార ప్రజాభిమానముందని, ఈసారి భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజాసేవ అనే మూడు లక్ష్యాలతో బీజేపీ ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రభావం ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందని, అహికోడ్‌లో మార్పు కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రముఖ నాయకులు, స్థానిక కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమెరికాతో ఎలాంటి చర్చలు జరపడం లేదు: ఇరాన్

**టెహ్రాన్:** ఇరాన్‌తో రెండు రోజులుగా జరుగుతున్న చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయని, దీంతో ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజులు వాయిదా వేయాలని తన బలగాలను ఆదేశించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై టెహ్రాన్ స్పందించింది. అమెరికాతో ఎలాంటి చర్చలు జరపడం లేదని స్పష్టం చేసింది. తమ ఇంధన సంస్థలపై ఎలాంటి దాడులు చేసినా శత్రువుల ఇంధన వనరులపై దాడి చేస్తామని టెహ్రాన్ గట్టి హెచ్చరిక చేసినట్టు తెలిపింది. దీంతో ఇరాన్ ప్రతీకార చర్యలకు పాల్పడుతుందనే భయంతోనే ట్రంప్ వెనక్కి తగ్గారని ప్రభుత్వ మీడియా పేర్కొంది. ట్రంప్ మాటలను పూర్తిగా నమ్మలేమని, దాడుల వాయిదా పేరుతో సమయం చూసి దాడి చేసేందుకు కుట్ర చేస్తున్నారని వ్యాఖ్యానించింది.

**యుద్ధ విరమణ అమెరికాకే పరిమితం.. :** ట్రంప్ యుద్ధ విరమణ ప్రకటనపై ఇజ్రాయెల్ సైతం స్పందించింది. యుద్ధ విరమణ అమెరికాకే పరిమితమని పేర్కొంది. తాము యుద్ధాన్ని విరమించలేదని తెలిపింది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో ప్రపంచదేశాల్లో ఇంధన సంక్షోభ పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో ట్రంప్ ఇరాన్‌కు 48 గంటల డెడ్‌లైన్ విధించారు. గడువులోగా హోర్ముజ్ జలసంధిని తెరవాలని, లేదంటే ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ఆ గడువు మంగళవారంతో ముగియడంతో ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తాజా పోస్ట్ పెట్టారు. ఇరాన్‌తో చర్చలు ఫలప్రదంగా సాగుతున్నందున 5 రోజుల పాటు దాడులు నిలిపివేయాలని ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతాయని, వాటి ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని తెలిపారు.



## చలివేంద్రాన్ని ప్రారంభించిన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి

**గన్నవరం, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**

కృష్ణాజిల్లా, గన్నవరం మండలం లో ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో బీజేపీ గన్నవరం మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సామాజిక బాధ్యతగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణికులకు, బాటసారులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల మోహన్ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కానూరు శేషు మాధవి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి, కురమద్దాల ఫణి కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అన్నే హరి కృష్ణ టీడీపీ క్లస్టర్ ఇంచార్జి, రామకృష్ణ జనసేన నాయకులు, మేడూరి శేష్ బాబు, వెంకట కృష్ణ మండల ప్రధాన కార్యదర్శి, ఈ కార్యక్రమంలో పాము సిద్ధు, కోటేశ్వరరావుతో పాటు కూటమికి చెందిన పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం చేనేత కార్మికుడి పాదయాత్ర ప్రారంభం



**జగ్గయ్యపేట, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు "భారతరత్న" అవార్డు సాధించాలనే లక్ష్యంతో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు బి.ఎల్. నర్సింహులు పాదయాత్రను ప్రారంభించారు. ఎన్టీఆర్ జన్మస్థలం నిమ్మకూరులోని ఆయన దంపతుల విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర పలు ప్రాంతాల మీదుగా కొనసాగుతూ జగ్గయ్యపేట పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా నర్సింహులు జగ్గయ్యపేట శాసనసభ్యుడు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ఆయన దీక్ష, పట్టుదలను అభినందిస్తూ పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇందుగుపల్లి ఎంపీటీసీ చావా నాగేశ్వరరావు, వేదాద్రి మాజీ సర్పంచ్ పసుమర్తి జగజ్జీవన్ రామ్, బడే నాగేశ్వరరావు, కన్నా రవి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి దేవస్థానాన్ని సందర్శించిన వారాహి పీఠాధిపతి

**జగ్గయ్యపేట, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**



జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని నైమిశారణ్య శ్రీ వారాహి పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ ఆదివారం ఉదయం సందర్శించారు. ఉదయం 10:30 గంటలకు ఆలయానికి విచ్చేసిన స్వామీజీకి ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి విశిష్టత, ఆలయ ప్రాముఖ్యతపై భక్తులకు విపులంగా వివరించారు. స్వామీజీ ప్రవచనాలను భక్తులు ఆసక్తిగా ఆలకించి ఆనందం వ్యక్తం చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి నూతక్కి సాంబశివరావు తెలిపారు.

## గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా జొన్నభట్ల కిషోర్ శర్మ ఎన్నిక



**జగ్గయ్యపేట, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**

జగ్గయ్యపేట గాయత్రి బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షునిగా జొన్నభట్ల కిషోర్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని గాయత్రి కళ్యాణ మండపంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా పల్లెకున కేశవ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మాడపాటి కిషోర్, కోశాధికారిగా మంగు చైతన్య శర్మ తదితర కార్యవర్గ సభ్యులను కూడా సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియను సంఘ న్యాయ సలహాదారు, ప్రముఖ న్యాయవాది ఈశ్వర వెంకట జగన్నాథరావు పర్యవేక్షించారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కిషోర్ శర్మకు సంఘ సభ్యులు, బ్రాహ్మణ ప్రముఖులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, జగ్గయ్యపేటతో పాటు పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సేవలు అందిస్తానని తెలిపారు. ఇదే కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన పూర్వ అధ్యక్షుడు కలవకొలను వీరాంజనేయ శర్మకు సంఘ సభ్యులు సత్కారం నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాలుగా సంఘాన్ని సమర్థంగా నడిపిస్తూ గాయత్రి కళ్యాణ మండపం నిర్మాణంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు పిల్లల మర్రి నాగకృష్ణ శర్మ, కీసర రాంబాబు, బాచినప్ప కోటేశ్వరరావు, మాదిరాజు కేశవరావు, మహిళా ప్రతినిధులు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పైప్డ్ గ్యాస్.. సురక్షితం, సౌకర్యవంతం

- పీఎన్‌జీ కనెక్షన్ దిశగా ప్రజలు దృష్టిసారించాలి
- ముందు జాగ్రత్తగా వినియోగానికి ముందుకు రావాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**



ప్రస్తుతం ఎల్‌పీజీ వంట గ్యాస్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్తగా ప్రజలు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వినియోగం వైపు మళ్లాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. కలెక్టర్ లక్ష్మీశ.. ఆదివారం క్యాంపు కార్యాలయంలో భాగ్యనగర్ గ్యాస్, మేఘా గ్యాస్ ప్రతినిధులతో సమావేశం అనంతరం సిద్ధార్థ నగర్ ఎస్‌బీఐ కాలనీలోని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ రెగ్యులేటింగ్ స్టేషన్ ను సందర్శించారు. కుళాయి నీటి తరహాలో పైపుల ద్వారా ఇంటింటికీ నేచురల్ గ్యాస్ సరఫరా విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 9 వేలు మాత్రమే పీఎన్‌జీ కనెక్షన్లు ఉన్నాయని.. లక్ష వరకు కనెక్షన్లు ఇవ్వగల సామర్థ్యం ఇప్పుడు ఉందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక భద్రతతో నిరంతర గ్యాస్ సరఫరాకు ఈ కనెక్షన్లు వీలుకల్పిస్తాయన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు లేదా సంక్షోభ పరిస్థితులు ఎదురైనా గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు పీఎన్‌జీ ఉత్తమ ప్రత్యామ్నాయమని తెలిపారు. గృహాలకు నేరుగా పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందుబాటులో ఉండటం వల్ల సురక్షితం గా, సౌకర్యవంతంగా ఉపయోగిం చుకో వచ్చని చెప్పారు. 21 మిల్లీబార్ పీడనంతో సరఫరా అనేది సురక్షిత మైనదని.. అందువల్ల ఇలాంటి సురక్షితమైన వంట గ్యాస్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే చాలా హోటళ్లు పీఎన్‌జీ ఉపయోగి స్తున్నాయని.. మిగిలి నవి కూడా పీఎన్‌జీ దిశగా ఆలోచిం చాలని కోరారు. జిల్లాలో ఎవరికైనా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్ కావాల నుకుంటే కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కేంద్రం (91549 70454) నంబరుకు కాల్ చేయొచ్చని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గృహాలు, హోటళ్లు, పారిశ్రామిక యూనిట్లు తదితరాలకు సురక్షితమైన, నిరంతర గ్యాస్ సరఫరా అందించేలా పీఎన్‌జీ కనెక్షన్లకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. పీఎన్‌జీ ప్రయోజనాలతో పాటు పూర్తి వివరాలను ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న సిబ్బంది వివరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

# రెండో ఎస్‌టీపీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

- వీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలు

**విజయవాడ, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. జి. లక్ష్మీశ ఆదివారం విజయవాడ రామలింగేశ్వర నగర్‌లోని 20 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్‌టీపీ)ని సందర్శించారు. మురుగునీటి శుద్ధి ప్రక్రియ, వినియోగంలో ఉన్న సాంకేతిక విధానాలు, నిర్వహణ తీరు వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ సామర్థ్యానికి అనుగుణంగా శుద్ధి జరుగుతోందా లేదా అన్న దానిపై సమగ్రంగా సమీక్షించారు. అదేవిధంగా కొత్తగా ఏర్పాటుచేస్తున్న మరో 20 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న ప్లాంటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పెరుగుతున్న నగర విస్తీర్ణం, జనాభాను దృష్టిలో ఉంచుకుని మురుగునీటి శుద్ధి అత్యంత కీలకమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎస్‌టీపీ సామర్థ్యానికి తోడు నిర్మాణ ంలో ఉన్న రెండో ఎస్‌టీపీ పనులను త్వరిత గతిన పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశిం చారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ దశలో సాంకేతిక ప్రమాణాలు పాటిస్తూ, పర్యావరణ పరిరక్షణకు అనుగు ణంగా పనులు కొనసాగించాలన్నారు. ఈ పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ సీఈ పి.సత్యకుమారి ఉన్నారు.

### మాజీ డ్రైవర్ కుటుంబంపై

# ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఆత్మీయత



**గన్నవరం, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**

కృష్ణా జిల్లా, గన్నవరం నియోజకవర్గం, తన ఎదుగుదలలో తోడున్న వారిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఎన్నడూ మరువరని మరోసారి నిరూపితమైంది. నిడమానూరు పర్యటన ముగించుకుని వస్తుండగా, రోడ్డుపై తన మాజీ డ్రైవర్ జూటూరి సురేష్ కుటుంబాన్ని గమనించిన ఎమ్మెల్యే, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపి వారితో ముచ్చటించారు. ప్రోటోకాల్ ఆడంబరాలు పక్కన పెట్టి, రోడ్డు పక్కనే సురేష్ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. సురేష్ కుమార్తెల చదువుల గురించి అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. పదవులు శాశ్వతం కాదని, నమ్మకంగా పనిచేసిన వ్యక్తులు మరియు ఆత్మీయ సంబంధాలే ముఖ్యం అని యార్లగడ్డ పేర్కొన్నారు. ఎమ్మెల్యే హోదాలో ఉండి కూడా తన పాత సిబ్బందిని గుర్తుంచుకుని పలకరించడంపై స్థానికులు మరియు సురేష్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# రూ.1.5 కోట్ల అభివృద్ధి పనులు



- ప్రగతి పథంలో బొమ్మసముద్రం


**ఐరాల, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**

పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల మండలం బొమ్మసముద్రం గ్రామం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసి కూటమి ప్రభుత్వం గ్రామానికి కొత్త రూపు తీసుకువచ్చింది. ఈ కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో గోకులం షెడ్లు, చెరువు మొరవ కల్వర్టుల మరమ్మతులు, ఆరోగ్య కేంద్రం, ఎంపీపీ పాఠశాల ప్రహరీ గోడ, కొత్త పాఠశాల భవనాలు, సిమెంట్ రోడ్లు, దళితవాడలో కమ్యూనిటీ హాళ్లను వారు ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బాణాసంచా, మంగళవాయిద్యాలతో వారిని ఆహ్వానించి పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడిన వారు, అభివృద్ధి మరియు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహంతో నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. బొమ్మసముద్రం పంచాయతీ అభివృద్ధి పనులతో మోడల్ గ్రామంగా మారడం ఆనందదాయకమని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేయకుండా అభివృద్ధిని గుర్తించాలని సూచించారు.

# యుద్ధ ప్రభావాలపై ముందస్తు కార్యాచరణ అవసరం

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర వైస్ చైర్మన్, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు

**జగ్గయ్యపేట, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్)**



ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ధరల పెరుగుదలపై మాత్రమే స్పందించడం సరిపోదని, పశ్చిమ ఆసియా యుద్ధ పరిణామాల నేపథ్యంలో రాబోయే ఆర్థిక, సామాజిక ప్రభావాలపై ముందుగానే సమగ్ర కార్యాచరణ రూపొందించడం అత్యవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర వైస్ చైర్మన్, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం జగ్గయ్యపేటలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధ ప్రభావం కేవలం ఇంధన ధరల పెరుగుదలతో మాత్రమే పరిమితం కాకుండా, ఆహార భద్రత, ఔషధాల లభ్యత, రవాణా వ్యవస్థ, సరఫరా గొలుసుపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ముందస్తు ప్రణాళిక లేకపోతే సామాన్య ప్రజలే ఎక్కువగా నష్టపోయే పరిస్థితులు తలెత్తవచ్చని తెలిపారు. ప్రభుత్వం అత్యవసర వస్తువుల నిల్వలను సమీక్షించి, బఫర్ స్టాక్‌లను పెంచాలని, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ధరల పర్యవేక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, హోర్డింగ్, బ్లాక్ మార్కెటింగ్ వంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అపోహలు సృష్టించకుండా ప్రజలకు నిజమైన సమాచారం అందించాలని సూచించారు. వినియోగదారులు అవసరమైన వస్తువులనే వినియోగిస్తూ అనవసరంగా నిల్వలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మేధావులు, విధాన నిర్ణేతలు, ప్రజా ప్రతినిధులు కలిసి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కాదు, ముందే సిద్ధం కావడం సమాజ బలం" అని కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి



చేవేళ్ల మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్) : అమ్డాపూర్ గ్రామానికి చెందిన వల్లబొడ్డు విజయ్ కుమార్ (54) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం సుమారు 11:00 గంటలకు కొత్త బట్టలు కొనుగోలు కోసం హోండా షైన్ (టా07 -రూూ 8309) పై నార్సింగి వెళ్లిన విజయ్ కుమార్, మధ్యాహ్నం సుమారు 2:40 గంటలకు ఇంటికి తిరిగి వస్తుండగా అజీజ్ నగర్‌లోని వీఆర్‌కే కాలేజీ గేట్ వద్ద బైక్‌పై నియంత్రణ కోల్పోయి గేట్‌ను ఢీకొని పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో సంఘటనా స్థలంలోనే ఆయన మృతి చెందినట్లు సమాచారం. మృతుడి భార్య వల్లబొడ్డు కర్పూర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సిఆర్డిఎ అధికారుల బదిలీలతో

**- అమరావతి పనులపై ప్రభావం - 20 నెలల కాలంలో ముగ్గురు మార్పు**

**- నాలుగో కమిషనర్ విజయరామరాజు**

అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) : అమరావతి రాజధాని నిర్మాణం కీలకదశలో ఉన్న సమయంలో సిఆర్డిఎ కమిషనర్ల మార్పు చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ విభాగంలోనూ జరగనన్ని మార్పులు సీఆర్డీఏలో చేశారు. అత్యంత కీలకమైన రాజధాని విషయంలో ఇలా వరుసగా మార్చుకుంటూపోతే అభివృద్ధిపై ప్రభావం పడుతుందనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చే అధికారి అర్థం చేసుకొని పూర్తిస్థాయిలో పనిలో దిగేందుకు కనీసం ఆరునెలలు పడుతుంది. ఈ వేసవిలో పనులు మరింత వేగంగా జరగాల్సి ఉంది. సీఆర్డీఏకు కొత్తగా వచ్చిన విజయరామరాజు నాలుగో కమిషనర్ కావడం విశేషం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి వివేక్ యాదవ్ కమిషనర్గా ఉన్నారు. ఆయనస్థానంలో కాటంనేని భాస్కర్ న్ను నియమించారు. నిబంధనలు ఖచ్చితంగా అమలు చేసే అధికారిగా ఆయనకు పేరుంది. అయితే అతి తక్కువ సమయంలోనే అతన్ని బదిలీచేసి కన్నబాబును నియమించారు. ఈయన కూడా అంతోఇంతో రైతులను కలుపుకుపోతూ చిన్న చిన్న సమస్యలు పరిష్కరించుకుంటూ వెళుతున్నారు. గ్రామాల వారీగా సభలు ఏర్పాటుచేసి ప్రజలు వ్యక్తంచేసే అభిప్రాయాలు తెలుసుకోవడంతోపాటు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. మరోవైపు రైతులు వ్యక్తం చేసే సమస్యలపై ప్రభుత్వం త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసింది. అమరావతిలో జరిగే పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు నిధులు జమచేసేందుకు వీలుగా ప్రత్యేక సాఫ్ట్వేర్ ఏర్పాటుచేసి వర్కు రియాలిటీ ఆధారంగా బిల్లులు చెల్లిస్తున్నారు. పనులపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. రైతు జెఎసితో చర్చలు జరుపుతున్నారు. ప్రతివారం సమావేశాలు ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. ఎకనామిక్ ప్రాజెక్టులనూ వేగవంతం చేశారు. త్రీమెన్ కమిటీ ఇచ్చే సూచనలను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నపళంగా కన్నబాబును మార్చి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్గా ఉన్న విజయరామరాజును తీసుకువచ్చారు. రైతు జెఎసి నాయకులు కూడా త్రీమెన్ కమిటీలో సమస్యలు పరిష్కారం కావడం లేదనే ఉద్దేశంతోనే వున్నారు. కొత్త కమిషనర్ ఈ పనులను అర్థం చేసుకుని, కార్యాచరణ ఎప్పుడు ప్రారంభిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పెద్ద ప్లాట్లను విభజించాలనే అంశం ముందుకు వచ్చింది. ఇలా విభజిస్తే అమరావతి రాజధాని మాస్టర్ ప్లాను అమలు కష్టమవుతుందని అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిషనర్ మార్పునకు ఇది కూడా ఒక కారణమని తెలిసింది. ఇటీవల మంత్రి నారాయణ కూడా ఓ సమావేశంలో కన్నబాబుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వీటితో పాటు కాంట్రాక్టర్లు కూడా కమిషనర్ను మార్చాలని పై స్థాయిలో పట్టుబట్టినట్లు తెలిసింది. అలాగే ప్రస్తుతం సి ఆర్ డి ఏ పరిధిని తగ్గించేశారు. పనులన్నీ ఏజిఐసిఎల్ కు బదలాయించారు. కొత్తగా వచ్చే ప్రాజెక్టులన్నీ అదే చేపడుతుంది. సి ఆర్ డి ఏ బిల్లులు చెల్లింపులకే పరిమితం అవుతుంది.

## మధ్యాహ్నం భోజనం కార్మికులకు స్కూల్ స్లిప్పర్స్ లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి ఏఐటియుసి డిమాండ్



మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్) : చిత్తూరు జిల్లా నగిరి: ఏఐటీయూసీ పుత్తూరు డివిజన్ సమితి ఏఐటీయూసీ పుత్తూరు డివిజన్ అధ్యక్షులు కే గోపి అధ్యక్షతన డివిజన్ పరిధిలో ఉన్న మధ్యాహ్నం భోజనం కార్మికులు స్కూలు పనిచేస్తున్న స్లీపర్స్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఏఐటియుసి డివిజన్ కార్యదర్శి ఎస్ చంద్రబాబు ,సిపిఐ పార్టీ పుత్తూరుమండల కార్యదర్శి డి మహేష్ మాట్లాడుతూ స్కూల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు స్లీపర్సకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని రాజకీయ వేధింపులు మానుకోవాలని తెలిపారు వంటగ్యాసులు ఉచితంగా ఇవ్వాలని విద్యార్థులకు మేనేజ్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు మధ్యాహ్నం భోజనం కార్మికులకు 3000 రూపాయల మాత్రమే ఇస్తున్నారని అది చాలడం లేదని కార్మికుల దగ్గర వ్యక్తి చాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మధ్యాహ్నం భోజనం కార్మికులకు యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు స్కూల్ స్లీపర్స్ లకు గుర్తింపు కార్డులు ,యూనిఫాంలో ఇవ్వాలని తెలిపారు డివిజన్ పరిధిలో కొన్ని పాఠశాలలో ఇప్పటికే గ్యాస్ సర్వర్ లేకపోవడం కట్టెల పొయ్యిలతో వంట చేపడుతున్నారని ఆయన చెందారు ఉన్నత అధికారులు స్పందించి మధ్యాహ్నం భోజనం కార్మికులు స్కూల్ స్లిప్పర్స్ పరిష్కరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమణ కృష్ణారెడ్డి కైలాసం మధ్యాహ్న భోజనం నాయకులు పద్మ ,కస్తూరి, సుశీల, లతా ,స్కూల్ స్లిప్పర్స్ గీత ,వాణి ,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## మైలార్‌దేవ్‌పల్లిలో అక్రమ హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

**10 మంది అదుపులోకి**



రాజేంద్రనగర్, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్) : రాజేంద్రనగర్ జోన్ మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వటేపల్లిలో నివాస ప్రాంతాల మధ్య అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై పోలీసులు మెరుపు దాడి చేశారు. అందులో పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## తాలూకా స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు ఘనంగా

**పోటీలను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ఉడతల భాస్కర్**



చిన్నంబావి మండలం (జర్నలిస్ట్ ఫైల్) : వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రైతు సంబరాల పేరుతో తాలూకా స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు ఆదివారం చిన్నంబావి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం శ్రీశ్రీశ్రీ తిరుమలనాథ స్వామి వారి ఆశీస్సులతో ప్రారంభమైంది. పెద్దదగడ గ్రామానికి చెందిన దాతల సహకారంతో ఈ పోటీలు నిర్వహించగా, మేకల సహదేవుడు రూ.40,000, పోచమోని పెద్ద వెంకటస్వామి రూ.15,000, చెన్నమోని గంగయ్య యాదవ్ రూ.10,000, కన్నమోని శంకరయ్య యాదవ్ రూ.5,000 నగదు ఈ దాతల సహకారంతో ఆటల పోటీలు నిర్వహిస్తూ బహుమతులను అందించారు. అలాగే మరణించిన వారి జ్ఞాపకార్థం కూడా బహుమతులు ఏర్పాటు చేయడం జరిగింది.



గ్రామ సర్పంచ్ ఉడతల భాస్కర్ , గ్రామ పెద్దలు పూజలు నిర్వహించి ఈ ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం ఎంతో అవసరమని తెలిపారు. పోటీలను చూడటానికి భారీగా ప్రజలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో పెద్దదగడ గ్రామానికి చెందిన చెన్నమోని గంగన్న మొదటి బహుమతి రూ.20,000ను కైవసం చేసుకున్నారు. కొప్పునూర్ గ్రామానికి చెందిన నంది మధుసూదన్ రెడ్డి ద్వితీయ బహుమతి రూ.15,000ను గెలుచుకోగా, మూడవ స్థానంలో నిలిచి రూ.10,000ను కూడా సాధించారు. జటప్రోలు గ్రామానికి చెందిన కుమ్మరి దర్గయ్య నాలుగో బహుమతి రూ.5,000ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉడతల భాస్కర్, గ్రామ ఉపసర్పంచ్ మొలకలపల్లి రమేష్, మేకల సహదేవుడు, పోచమోని శ్రీహరి, చెన్నమోని గంగ, కన్నమోని శంకరయ్య, కన్నమోని శ్రీను, కరాల వెంకటేష్, గోడ దర్గయ్య, బొల్లు నరసింహ, మేకల నరేష్, పోచమోని శేఖర్, గోడ ఎల్లస్వామి, సి.రాజు, మల్లేష్, జింకల కృష్ణ, పెద్దతగడ గ్రామ రైతులు, రైతు కమిటీ సభ్యులు, క్రీడల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు.

# పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా

**- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి**



నంద్యాల, (జర్నలిస్ట్ ఫైల్) : పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా ఇస్తుందని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సిఫారసుల మేరకు మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అందజేశారు. పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు కు చెందిన కాసుల రష్మికి రూ. 355996 లు, నందికొట్కూరు నియోజకవర్గం పగిద్యాల మండలం పాత ముచ్చుమర్రి కి చెందిన కర్నె. పార్వతికి రూ. 224656లు. నంద్యాల నియోజకవర్గం రైతు నగరం కు చెందిన మువ్వా అమర సింహరెడ్డికి రూ.237212లు, గోస్పాడు మండలం కానాలపల్లెకు చెందిన వై రామిరెడ్డికి రూ. 125000లు, పాణ్యం నియోజకవర్గం గడివేముల మండలం కోరటమద్దికి చెందిన డి నాగప్రతాప్ రెడ్డికి రూ. 187723 లు. నందికొట్కూరు నియోజకవర్గం, మిడ్తూరు మండలం చింతలపల్లె కు చెందిన కె ఎస్ ఉషారాణికి రూ. 176291లు. ఆళ్లగడ్డ నియోజకవర్గం, సిరివెళ్ల మండలం కోటపాడుకు చెందిన జి లీలావతికి రూ. 162000లు. పగిద్యాల మండలం లక్ష్మా పురం కు చెందిన పి నాగమ్మ కు రూ. 132250లు, గడివేముల మండలం పెసరవాయి కి చెందినకె తులసి రామిరెడ్డికి రూ. 111000 లు, నందికొట్కూరు పట్టణం మారుతీ నగర్ కు చెందిన కె రక్షిత(మరణం) విజయ్ కుమార్ కు రూ. 86773లు, గడివేముల మండలం బిలకలగూడూరుకు చెందిన బి పెద్ద సంజీవ రెడ్డి కి రూ. 73814 లు. ఆళ్లగడ్డ నియోజకవర్గం సిరివెళ్ల మండలం, గుండంపాడు కు చెందిన వంకాయల లక్ష్మీదేవి కి రూ. 56000 లు, బనగానపల్లె నియోజకవర్గం, కోవెలకుంట్ల మండలం, బీమునిపాడుకు చెందిన గంగాల పద్మావతమ్మకు రూ. 44836 లు, పాణ్యం మండలం ఎస్. కొత్తురు కు చెందిన బుద్దగల్ల కార్తిక్ కు రూ. 37114 లు, శ్రీశైలం నియోజకవర్గం, వెలుగోడు మండలం, రేగడగూడూరుకు చెందిన పెరెడ్డి వెంకటేశ్వరమ్మకు రూ. 35000లు, శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండలం ముష్టపల్లి కు చెందిన ఎం ప్రవీణ్ కుమార్ కు రూ.53734 లు, ఆళ్లగడ్డ మండలం సింగం దిన్నే కు చెందిన సుభాన్ (బాలిక)/దూదేకుల అయేషాకురూ. 37793 లు, డోన్ నియోజకవర్గం బేతంచెర్ల కు చెందిన ఎన్ సరస్వతికి రూ. 45270 లు, గోస్పాడు మండలం యాల్లూరు కు చెందిన జి. ఎర్రమళమ్మకు రూ 26084లు పాములపాడు మండలం వాణాలకు చెందిన సందేపోగు జోష్ణ కు రూ. 75300లు, పాములపాడు మండలం ఎర్రగూడూరు కు చెందిన చెల్లె లక్ష్మీదేవి కి రూ. 37551లు, నంద్యాలకు చెందిన బచ్చు రామ రత్నమ్మ కు రూ. 105618 లు, ఇలా మొత్తం22 మంది బాధితులకు రూ. మొత్తం - 24,27,015 లక్షల చెక్కులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి, ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు వెంటనే విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు భాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు రక్షణ, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం రైతు సంఘం కృషి

**రైతుల అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి**

**స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలి**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశంలో వక్తలు**




ఏలూరు, (జర్నలిస్ట్ ఫైల్) : రైతు రక్షణ, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశంలో వక్తలు చెప్పారు. రైతు మనుగడ కోసం ఉద్యమాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు యుటిఎఫ్ భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పంటల రైతులు కనీస మద్దతు ధరలు రాక, పంటలు కొనే నాథుడు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం నేపథ్యంలో ఆక్వా, మొక్కజొన్న, మిర్చి, మామిడి, అరటి, కోకో,కొబ్బరి, వర్జీనియా పొగాకు తదితర పంటలు కొనుగోలు సక్రమంగా జరగడం లేదన్నారు. రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రభుత్వాలు మాటలు చెబుతున్నాయి తప్ప ఆచరణలో రైతులను ఆదుకునే చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ నష్టాలతో అన్నదాతల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రైతులకు ఉపయోగకరమైన చట్టాలు కాకుండా కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టే చట్టాలను తీసుకు వస్తున్నారని చెప్పారు. దీనివలన రైతుల వ్యవసాయం నాశనం అవుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కార వేదికగా కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు అన్ని విధాల జయప్రదం అయ్యేందుకు రైతాంగంతోపాటు వివిధ వర్గాల, తరగతుల ప్రజలు, ఉద్యోగ,కార్మిక, వర్తక -వాణిజ్య సంస్థలు అందరూ సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ అధ్యక్షులు బి.బలరాం, ప్రముఖులు రావి.గోపాలకృష్ణయ్య, వ్యవసాయ శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసాదరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కారణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డి.ఎన్. వి.డి ప్రసాద్, కోకో రైతు సంఘం రాష్ట్ర నాయకులు పానుగంటి అచ్యుతరామయ్య, పర్వతనేని సుబ్రహ్మణ్యేశ్వర రావు, శ్రామిక మహిళా నాయకురాలు ఎం.నాగమణి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ. శ్యామల రాణి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, ఏవిఆర్ విజ్ఞాన్ కేంద్రం కార్యదర్శి జి. నరసింహారావు, ప్రజా సంఘాల నాయకులు పంపన రవికుమార్, ఎం.ఇస్సాకు తదితరులు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23 మహాసభలు తొలిసారిగా రైతు ఉద్యమాల కేంద్రం ఏలూరులో నిర్వహించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ మహాసభల అన్ని విధాలా తోడ్పడతామని చెప్పారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా నాయకులు గుండపనేని సురేష్, గంటా పాపారావు వివిధ మండలానికి వచ్చిన రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం..!

**వెండి కిరిటాలు, బంగారపు ఉంగరాలు నాకొద్దు..!**

**నా జీవితంలో 'జే' టాక్స్ వసూళ్లు ఉండవు..!**

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



మాచర్ల: మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్యవైశ్యుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. ఆదివారం పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో ఆర్యవైశ్యుల పట్టణ, యువజన, మహిళా సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే జూలకంటిని వేద పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కళ్యాణ మండపంలో జాతిపిత గాంధీజీ, అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనతరం ఆర్యవైశ్య పట్టణాధ్యక్షులుగా గరిణే శ్రీనివాసరావు, యువజన సంఘం అధ్యక్షులుగా కొత్తూరి చందు, మహిళా సంఘం అధ్యక్షురాలిగా సొలస కళ్యాణి లతో పాటు కార్యవర్గ సభ్యులతో పదవీ బాధ్యతల ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. రాజధాని అమరావతిలో 58 అడుగుల ఎత్తు పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి, ప్రారంభించే సమయంలో ఆత్మ బలిదానానికి గుర్తు విగ్రహాన్ని నిర్మించామని మంత్రి లోకేష్ ప్రసంగించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును ప్రభుత్వ అధికార దినోత్సవంగా ప్రకటించి, వైశ్యుల పట్ల చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించారని వివరించారు.

**వెండి కిరిటాలు, బంగారపు ఉంగరాలు నాకొద్దు..!**

రియల్ ఎస్టేట్ వెంచర్లు, నూతన అపార్ట్మెంట్ ప్రారంభోత్సవాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాల సమయంలో యాజమాన్యం అందించే వెండి కిరిటాలు, బంగారపు ఉంగరాలు తనకొద్దు అని, అటువంటి వాటికి నేను వ్యతిరేకమని ఎమ్మెల్యే జూలకంటి తేల్చి చెప్పారు. పిన్నెల్లి సోదర్లు వలె టాక్స్ లు, పీడించి మరి బహుమతులను తాను డిమాండ్ చేయనని, అటువంటి సాంప్రదాయానికి తాను విరుద్ధమన్నారు. బానిస సంకేళ్లు తెంపి, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాజీవనం, వ్యాపారాలు సాగేలా పాలన సాగిస్తానని ఆనాడు ఇచ్చిన హామీకి ఎప్పుడూ కట్టుబడే ఉన్నానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం జే టాక్స్ వంటి వసూళ్లు ఉండబోవని, అటువంటి ఎట్టిపరిస్థితిలో ఒప్పుకొనని కుండబద్దలు కొట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిచడమే లక్ష్యంగా పనిచేస్తానని వెల్లడించారు. రూ. 1200 కోట్లతో జల్ జీవన్ మిషన్, రూ. 130 కోట్లతో అమృత్ స్కీం, రూ. 3 వేల 240 కోట్లతో వరికపూడిశెల నిర్మాణాలు జరుగుతాయని, అవి పూర్తి అయిన నాడు నియోజకవర్గ రూపురేఖల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అభివృద్ధిలో ప్రభుత్వంతోపాటు

**ప్రయివేటు వ్యక్తుల భాగస్వామ్యం కావడం హర్షనీయం**

**-మచిలీపట్నం ఎం. పి. వల్లభనేని బాలసౌరి**



పెనమలూరు, మార్చి 23 (జర్నలిస్ట్ ఫైల్) : అభివృద్ధిలో ప్రభుత్వంతోపాటు, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యం కావటం హర్షణీయమని ఎంపీ బాలసౌరి అన్నారు. పెనమలూరు నియోజకవర్గం,పెనమలూరు మండలం పెనమలూరు నుంచి వణుకూరు వరకు సుమారు 5 మీటర్ల వెడల్పుతో నాబార్డ్ మరియు ప్రైవేటు వ్యక్తుల సహకారంతో 2 కోట్ల 50 లక్షల నిధులతో నిర్మించిన తారు రోడ్డుని. మరియు మద్దూరు నుంచి కాసరనేని వారిపాలెం వరకు నాబార్డ్ నిధులు కోటి 40 లక్షలతో నిర్మించిన తారు రోడ్డుని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ లు శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ బాలసౌరి మాట్లాడుతూ పెనమలూరు నుంచి వణుకూరు వరకు నాబార్డ్ నిధులు కోటి 80 లక్షల కి, ప్రైవేటు వ్యక్తుల సహకారంతో రెండు కోట్ల 50 లక్షల లక్షల నిధులతో రోడ్డుని అభివృద్ధి చేయటంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కృషి అభినందనీయమని అన్నారు.అభివృద్ధి జరగాల్సిన చోట నిధులు కొరత ఏర్పడినప్పుడు ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థ హరివిల్లు చౌదరి చతుర్భుజ దుర్గాప్రసాద్ ల భాగస్వామ్యతో అభివృద్ధి చేయటం హర్షణీయమన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా అభివృద్ధిలో ప్రవేటు వ్యక్తుల భాగస్వామి చేయడం వల్ల బాధ్యతాయుతంగా ఉంటుందన్నారు. నియోజకవర్గాన్ని, ప్రభుత్వం నిధులు ప్రైవేటు వ్యక్తుల రియల్ ఎస్టేట్ హరివ చతుర్భుజా దుర్గాప్రసాద్ సహకారంతో మొట్టమొదటిసారిగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభివృద్ధి చేయటం శుభపరిణామం అన్నారు. వారికి సన్మానం చేశారు పెనమలూరు నియోజకవర్గం అమరావతి రాజధాని దగ్గరగా, సిఆర్డిఏ పరిధిలో ఉండటం వలన రోజురోజుకీ జనాభా, సిటీ విస్తరణ పెరుగుతుంది దీనికి తగినట్టుగా మౌలిక వసతులు కల్పనకు అనేక రకాలుగా నిధులు తెచ్చుకోవడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం న్యాయాఫీడ్ అనే బ్యాంకు వారు 20 సంవత్సరాల వరకు లోన్ ఇస్తున్నారు మన మున్సిపాలిటీ టాక్స్ కట్టడంలో ముందు ఉండటంవల్ల రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి అభివృద్ధికి నిధులుని సద్వినియోగపరుచుకోవచ్చు అన్నారు.మంత్రి నారాయణ తో కలిసి నియోజవర్గ అభివృద్ధిపై త్వరలో సమీక్ష నిర్వహిస్తామన్నారు. త్వరలో చోడవరం వద్ద బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధిలో ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేటు వ్యక్తులను భాగస్వామ్యం చేస్తూ కొత్త వరవడికి శ్రీకారం చుట్టామన్నారు. మొట్టమొదటిసారిగా నియోజకవర్గంలో ఈడుపుగల్లు నుంచి ఉప్పులూరు వరకు ఏడు మీటర్ల రోడ్డు, పెనమలూరు నుంచి వణుకూరు వరకు రోడ్డు విస్తరణలో ప్రైవేటు వ్యక్తులను భాగస్వామ్యం చేస్తూ అభివృద్ధి చేశామన్నారు. ప్రాధాన్యత క్రమంలో వణుకురులో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల కాలనీలోని రోడ్లు డ్రైనేజీలు అభివృద్ధి చేస్తామన్నారు. పెద్దపులి పాక, తాడిగడప. చోడవరం, పెనమలూరు ఈ రెండు రోడ్లుని పెద్ద రోడ్లుగా అభివృద్ధి చేయడమే నా సంకల్పం అన్నారు. అర్బన్ ప్రాంతానికి అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కంకిపాడు ఎంపీపీ రాజ్యలక్ష్మి,సర్పంచ్ లింగాల భాస్కర్, సర్పంచ్ చెక్క జ్ఞాన విజయ రామలక్ష్మి, కూటమి ప్రతినిధులు, వెలగపూడి శంకర్ బాబు,మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయ ఆనంద ప్రసాద్, తోటకూర ఉదయ భాస్కర్, సంగేపు రంగారావు,సొంటి శివరాం ప్రసాద్ , తాతపూడి గణేష్, పితా గోపీచంద్, కొమ్మినేని శ్రీనివాసరావు, ఎలుకల విజయేంద్ర, కరిమికొండ సురేష్, మేక స్వాతి , పందుల రజిని, అరవపల్లి శివప్రసాద్, మటపర్తి బుజ్జి, చిగురుపాటి శ్రీనివాసరావు, అబ్దుల్ సలాం, మోర్ల నరేంద్ర, కిలారి శ్రీనివాసరావు, కిలారి వెంకటసుబ్బారావు, సుంకర రమేష్, పిడికెడు శ్రీనివాసరావు, కొల్లి కృష్ణారావు బి రాజశేఖర్ రెడ్డి, జై చంద్రశేఖర్, పులి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## పీఆర్జీఎస్ లో 187 ఫిర్యాదులు స్వీకరణ... తక్షణ విచారణకు ఎస్పీ ఆదేశాలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (క్రైమ్స్) కే. సుప్రజ, ఇతర డీఎస్పీలతో కలిసి మొత్తం 187 మంది ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. అందిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలకు సంబంధించిన అంశాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

ఈ ఫిర్యాదులపై చట్టప్రకారం తక్షణ విచారణ చేపట్టి నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ప్రజలు తమ ఫిర్యాదుల కోసం జిల్లా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా స్థానిక సబ్-డివిజన్ లేదా సర్కిల్ కార్యాలయాల్లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అలాగే ఎవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్థితిగతులను తెలుసుకోవడానికి 1100 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బెల్లం శ్రీనివాసరావు (ట్రాఫిక్), శ్రీనివాసరెడ్డి (మహిళా పోలీస్ స్టేషన్), మధుసూదన్ రావు (సీసీఎస్)తో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ హుండీ ఆదాయం 3 లక్షలు



కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ప్రసిద్ధిగాంచిన స్వయం భూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ బాపట్ల ఇన్స్పెక్టర్ ఎం గోపి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు గత రెండు నెలల కాలానికి సంబంధించి 3 లక్షల 5 వేల 616 రూపాయలు ఆదాయంగా వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ధర్మకర్తల మండలి చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ఆలయ పూజారి మువ్వా నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు తోట ఫణి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కి చెందిన బాపారావు, సి జి జి బి బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాప్టిస్ట్‌పేటలో 30 ఏళ్ల సమస్యకు పరిష్కారం

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి బాప్టిస్టు పేట పట్టణ తెలుగు బాప్టిస్టు సంఘ స్థలంలో సుమారు మూడు దశాబ్దాలుగా ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్ఫార్మర్ల సమస్యను మంత్రి నారా లోకేష్ పరిష్కరించారు.

ఈ ట్రాన్స్ఫార్మర్లు సంఘ కార్యకలాపాలకు అడ్డంకిగా మారడంతో పాటు భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంఘ సభ్యులు సమస్యను మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ఐటీ శాఖా మంత్రివర్యులు నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన నారా లోకేష్ స్పందించి, ఇచ్చిన శాఖా పరమైన ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించి, సంఘస్థలం నుంచి ట్రాన్స్ఫార్మర్ల తొలగింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సమస్యకు తక్షణ పరిష్కారం లభించడంతో సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## సకాలంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి నాదెండ్ల



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా రాష్ట్రములో అభివృద్ధి,సంక్షేమం ప్రధాన అంశాలుగా ఇబ్బందులను అధిగమిస్తు ప్రజలు మెచ్చేవిధంగా ముందుకు వెళుతున్నామని, ప్రతీ సమస్య నిర్ణీత గడువులోగా పరిస్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు కొల్లిపర గ్రీవెన్స్ లో అన్నారు. తెనాలి నియోజకవర్గ పరిధిలోని కొల్లిపర మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం లో,రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రివర్యులు, తెనాలి నియోజకవర్గ శాసన సభ్యులు నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి వర్యులు స్వయంగా ప్రజల నుండి వినతులను స్వీకరించి, వారి సమస్యలన శ్రద్ధగా విన్నారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరించగా, ప్రతి సమస్యను ప్రత్యేకంగా నమోదు చేసి, సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ముఖ్యంగా రేషన్ సరఫరా సమస్యలు, పింఛన్ల మంజూరు, గృహనిర్మాణ పథకాలు, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సమస్యలు, డ్రైనేజ్ వ్యవస్థ, వ్యవసాయ పరమైన ఇబ్బందులపై అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతు ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని స్పష్టంచేశారు. ప్రతి వినతిని సమగ్రంగా పరిశీలించి, గడువులోగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి మనోహర్ ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా, పారదర్శకంగా అందేలా కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియ జేయడానికి ప్రజాసమస్యల పరిష్కార వేదికలవంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ కరమని అన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమైవారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా త్వరితగతిన పరిష్కారాలు అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, జనసేన-బీజేపీ-తెలుగుదేశం పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## జల వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- ప్రపంచ నీటి దినోత్సవం పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):ప్రపంచ నీటి దినోత్సవం పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విద్యా పరిషత్ పోస్టర్ లను రూపొందించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. భావితరాలకు శుద్ధ జలాలను అందించడం, కాలుష్యం లేని పర్యావరణం, మంచి వాతావరణం అందించడం అవసరం అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి.నజీనా బేగం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అవగాహన, కార్యాచరణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఉన్నత పాఠశాల, కాలేజి విద్యార్థులకు మార్చి 22, ప్రపంచ నీటి దినోత్సవం నుంచి ఏప్రిల్ 22, ప్రపంచ ధరిత్రి దినోత్సవం వం-కు వివిధ కార్యక్రమాలు నిర్వహించుటకు పర్యావరణ విద్యా పరిషత్ పలు కార్యక్రమాలను రూపొందించిందని తెలిపారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా చేపట్టడం జరుగుతోందని వివరించారు. స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ ఏర్పాటు చేసిందని, విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతాభావాన్ని పెంపొందించడం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించడం, రోజువారీ జీవితంలో పర్యావరణహిత అలవాట్లు అలవరచుకోవడం, ఇందుకు పోస్టర్ తయారీ పోటీలు, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వృక్షసంరక్షణ, నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమాలు, శుభ్రత కార్యక్రమాలు కూడా చేపట్టడం జరుగుతోందని వివరించారు. నీటి వృధాను తగ్గించడం, పక్షులు జంతువులకు నీటిని పెట్టడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం, ప్రతి వారం ఒక చెట్టు నాటడం వంటి అంశాలపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించి భవిష్యత్తు తరాలు మంచి సమాజం పొందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతోందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, ఆయా సంస్థల ప్రతినిధులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వరలయ ఉగాది పురస్కారాలు అందుకున్న విభిన్న రంగాల ఉన్నతాధికారులు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): కళలకు జన్మస్థలం వంటి తెనాలిలో కళాసేవ చేస్తూ, క్రమం తప్పక చేసే కార్యక్రమాలలో స్వరలయ నిర్వహించే ఉగాది ఉత్సవాలకు ఓ ప్రాధాన్యం ఉంటుందని రెవిన్యు ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు.

స్వరలయవేదిక ఆధ్వర్యంలో స్థానిక బోస్ రోడ్ లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన ఉగాది పురస్కార కార్యక్రమానికి రాష్ట్ర రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

బొప్పరాజు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వివిధ రంగాలలోని వ్యక్తులను గుర్తించి వారిని సముచిత రీతిన గౌరవించడం, అభినందనీయమని, మరిన్ని కార్యక్రమాలు చేయడానికి లక్కరాజు సాయికి అందరి సహకారం అందించాలని కోరారు.

పిరమిడ్ యోగా గురువు డాక్టర్ జాస్తి సుబ్బారావు ప్రసంగిస్తూ ఒకే వ్యక్తి సుదీర్ఘ కాలంగా సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతిఫలం లేకుండా చేయడం, ఆదిశగా 540 కార్యక్రమాలు చేయడం,సాయి లక్కరాజు పట్టుదలకు నిదర్శనం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన దైవాల సుబ్రమన్యం మాట్లాడుతూ ఒక కార్యక్రమం కార్యరూపం దాల్చడానికి సాయి లక్కరాజు శ్రమ, కృషి, పట్టుదల అద్భుతమన్నారు.

ఈసందర్భంగా ఉగాది పురస్కారాలను బ్యాంకింగ్ రంగం నుండి భారతీయ స్టేట్ బ్యాంక్ హైదరాబాద్,రీజనల్ మేనేజర్ పి.ప్రశాంత్ కుమార్, విద్యా రంగం నుండి డాక్టర్ బండి విజయకుమార్, రవాణా రంగం నుండి తోట రాఘవరావు లకు శాలువా, పూలమాల, మెమెంటో, సన్మాన పత్రం లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమానికి,సాయి లక్కరాజు స్వాగతం పలుకగా, రావిపాటి ప్రేమ్ కుమార్ వందన సమర్పణ చేసారు. అనంతరం సత్యవర్ధన్, నాగమణి, శ్రీనివాస్, విష్ణుప్రియ లు,సంగీత విభావరి ద్వారా ఆలపించిన పాటలు సభను అలరించాయి! ఈ కార్యక్రమంలో తిరుమలరావు, దుర్గాప్రసాద్, మల్లేశ్వరరావు,రవి మోహన్,గోపాలకృష్ణ, ఉమామహేశ్వరరావు, డాక్టర్ పురుషోత్తమరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన ప్రజా అర్జీలను పరిష్కరించాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్
- పి.జి.ఆర్.ఎస్ కు 668 అర్జీలు

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో 668 అర్జీలు అందాయి. ఇందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 172, పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 187, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 5 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 236 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 58, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 10 అర్జీలు అందాయి.

సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి లతో కలసి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు.

అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు.

ఈ ఆర్జీలను పరిశీలించి త్వరితగతన పరిష్కారం చేయుటకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. రెవెన్యూ సమస్యలను రెవిన్యూ క్లినిక్ లలో సమర్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఓసి చెక్కు పంపిణీ



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి మండలం యర్రబాలెం లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసి చెక్కును మంత్రి నారా లోకేష్ చొరవతో సోమవారం టిడిపి నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు పంపిణీ చేశారు. మంద్రు లక్ష్మి కి రూ. 2,01,784 ల విలువైన ఎల్వోసీ మంజూరు పత్రాన్ని అందజేశారు. చెక్కును అందజేసినవారి లో ఆకుల పానకాలరావు,వై. శ్రీనివాసరావు, జనసేన నాయకులు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతుల నుండి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ శాఖలలో వివిధ కేటగిరిలకు రిజర్వు చేసిన 38 బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఈ నెల 25వ తేదీ నుండి ఏప్రిల్ 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని వివరించారు. దరఖాస్తు చేసే అభ్యర్థి వయస్సు18 సంవత్సరాలు పైబడి ఉండాలని 2026 జూలై 1వ తేదీ నాటికి 52 సంవత్సరాలు నిండి ఉండరాదన్నారు. ఈ బ్యాక్ లాగ్ ఉద్యోగాల సూచనలు, దరఖాస్తు నమూనా ఆన్లైన్ లో దరఖాస్తు ప్రక్రియ వెబ్ సైట్లో చూడవచ్చని తెలిపారు. వివరాలకు 0863 2323329 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని చెప్పారు.

## రబీ పంటలకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి




- రైతుసంఘం నాయకుల వినతులు

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):రబీసాగులో పండే జొన్న, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటుధర లభించేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎమ్ రైతుసంఘం ఆద్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార దిశగా నిర్వహించిన గ్రీవెన్స్ లొ, ఎమ్ పిడిఒ అత్తోట దీప్తి అర్జీ దారుల నుండి అర్జీలు స్వీకరించగా,జొన్నలు మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం తెనాలి కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన నాయకులు అనంతరం ఎంపీడీవో అత్తోట దీప్తికి వినతి పత్రం అందజేశారు. గ్రీవెన్స్ కార్యక్రమంలొ మండల స్థాయి వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అర్జీ సమర్పించిన రైతు సంఘ కార్యదర్శి ములకా శివ సాంబిరెడ్డి మీడియాతొ మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం వల్ల ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ధర తగ్గించి దళారులు కొనటం వలన రైతులు,కవులు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. క్వింటాల్ హైబ్రిడ్ జొన్న ధర 3699 రూపాయల

కు, మొక్కజొన్న క్వింటాల్ ధర 2400 లకు కొనాల్సి ఉండగా దళారులు సగానికి సగం తక్కువకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మీనమేషాలు లెక్కబెట్టకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో,కౌలు రైతు మేకల ప్రసాద్, డివిజన్ రైతు సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎమ్.సాంబశివరావు తాటి వెంకటేశ్వర్లు లంకా రత్నం, లోకయ్య మేకల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి పడేలా పరిష్కరించాలి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పిజిఆర్ఎస్ లో అందే ఆర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చేయాలని, చేయాలేని వాటిని పూర్తి వివరాలతో ఎండార్స్ మెంట్ ఇవ్వాలని, పరిష్కారం చేయకుండా చేసినట్లు అర్జీ క్లోజ్ చేస్తే షోకాజ్ నోటీసులు జారీ చేసి, చార్జెస్ ఫ్రేం చేస్తామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగిన పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి, ఉద్యోగ, కార్మిక సమస్యలపై అర్జీలను తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రజల నుండి అర్జీలు తీసుకొని మాట్లాడుతూ పిజిఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయడం లేదని తమకు ఫిర్యాదులు అందుతున్నాయని, జిఎంసి పిఎంయు బృందం క్రాస్ చెకింగ్ లో అటువంటి వారిని గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యంత ప్రతిష్టాత్మకంగా త్రాగునీటి సరఫరాపై అధిక దృష్టి సారిస్తున్నారని, ఇప్పటికే పలుమార్లు చెప్పినా క్షేత్ర స్థాయిలో త్రాగునీటి శ్యాంపిల్స్ సేకరించి, సిఎంఎంఎస్ యాప్ లో నమోదు చేయకుండా ఉన్న కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి సిఫార్స్ చేయాలని డిఈఈలను ఆదేశించారు. ఏఈ, డిఈఈలు కూడా త్రాగునీటి సరఫరా సమయాల్లో క్షేత్ర స్థాయిలో ఉండాలన్నారు. డ్రైన్ ని క్రాస్ చేస్తున్న పైప్ లైన్ల లిస్టు, వార్డ్ ల వారీగా బోర్ వెల్స్ మరమత్తులపై డిఈఈ, ఈఈలు సమగ్ర వివరాలతో సంతకాలు చేసిన నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి అర్జీని నిర్దేశిత గడువు మేరకు పరిష్కారం చేయాలని, జీరో బియాండ్ ఎస్ఎల్ఏ నిర్వహించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ప్రత్యేకంగా ఆర్జీలను తీసుకున్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు అధికారులు మస్టర్ రిజిస్టర్లు నిర్వహణ చేయాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకి ఇచ్చే పరిహారం నగరపాలక సంస్థ వారే చెక్కు రూపంలోనే ఇవ్వాలని, రోజువారి వేతనంపై విధులు నిర్వహించుటకు నియమించుకున్న సిబ్బందికి నెలవారి వేతనాలు ఇస్తూ వారికి ఆప్కాస్ ఉద్యోగుల వలె పిఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని ది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు కమిషనర్ ని కోరారు. ఆయా సమస్యలపై పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

పిజిఆర్ఎస్ ద్వారా 58 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 23, ఇంజనీరింగ్ విభాగం 20, రెవెన్యూ విభాగం 8, ప్రజారోగ్య విభాగం 5, ఉపా సెల్ 1, అకౌంట్స్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# పట్టాభిపురం పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- 60 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు స్వాధీనం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు నగరంలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేతాజీ నగర్ ప్రాంతంలో పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టారు.

వెస్ట్ సబ్ డివిజన్ సిబ్బందితో పాటు స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ఆపరేషన్ ప్రారంభానికి ముందు సిబ్బందికి విధులపై సూచనలు ఇచ్చి, అనుమానిత ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

నేతాజీ నగర్‌లో అనుమానితులు, పాత నేరస్తుల ఇళ్లను తనిఖీ చేసి, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లలో ఉన్నవారి వివరాలు సేకరించారు. వారి ప్రవర్తన, జీవన విధానంపై విచారణ చేసి, భవిష్యత్తులో నేరాలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి కేసుల్లో ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

అనుమానాస్పద వ్యక్తులు, అద్దెకు నివసిస్తున్న వారి వివరాలు సేకరించగా, ఇళ్లలో అద్దెదారుల ఆధార్, ఇతర గుర్తింపు పత్రాలను తనిఖీ చేశారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా గంజాయి నిర్మూలన లక్ష్యంగా కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గంజాయి రవాణా, నిల్వ, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనదారులు తప్పనిసరిగా తమ వాహన పత్రాలు వెంట తీసుకెళ్లాలని సూచిస్తూ, సరైన పత్రాలు చూపించిన వారికి వాహనాలు తిరిగి అప్పగిస్తామని చెప్పారు. పత్రాలు లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ ఆపరేషన్ ద్వారా ప్రాంతంలో భద్రత మెరుగుపడటంతో పాటు నేరాల నివారణకు దోహదం అవుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు, నగరంపాలెం సీఐ సత్యనారాయణతో పాటు ఇతర ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## 8,931 రోజుల అప్రతిహత పాలనతో మోదీ చరిత్ర సృష్టి



- ప్రధానిగా, ముఖ్యమంత్రిగా 8,931 రోజుల పాలన
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా కలిపి మొత్తం 8,931 రోజుల పాటు ప్రభుత్వాధినేతగా కొనసాగుతూ అరుదైన రికార్డు నెలకొల్పడం గర్వకారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును అధిగమించి, దేశ చరిత్రలో అత్యధిక కాలం పాలన సాగించిన నేతగా మోదీ నిలిచారని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ముఖ్యంగా భారతదేశాన్ని ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడంలో, మౌలిక సదుపాయాల విస్తరణలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని వివరించారు.

మోదీ పాలనలో దేశ గౌరవం అంతర్జాతీయ వేదికలపై మరింత పెరిగిందని, ఆయనకు విశ్వనేతగా గుర్తింపు లభించిందని మాధవ్ పేర్కొన్నారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, అనంతరం దేశానికి ప్రధానమంత్రిగా ఎలాంటి విరామం లేకుండా సేవలందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నారని తెలిపారు.

ఇదే సందర్భంగా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు వెల్లడించారు.

## పేదవిద్యార్థుల చదువులు,భోజన పథకంపై గరికపాటి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

- పేద విద్యార్థుల చదువుల పట్ల తన అయిష్టత,అక్కసును వెళ్ళగక్కిన గరికపాటి
- ప్రభుత్వ పాఠశాలలు గరికపాటి జాగీరు కావు
- గరికపాటి తన మనవళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి అక్కడి విద్యార్థులతో పోటీపడేలా చేయాలని సవాల్



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఇచ్చే మధ్యాహ్న భోజనం పథకం పట్ల ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు ఖండించారు. అమరావతిలో సురేష్ బాబు విలేకరులతో మాట్లాడుతూ గరికపాటి నరసింహారావు వ్యాఖ్యలు పేద విద్యార్థుల జీవితాలను అవమానించేలా ఉన్నాయన్నారు. పేద విద్యార్థుల చదువుల పట్ల గరికపాటి యొక్క వ్యతిరేకత,అక్కసును స్పష్టం చేస్తున్నాయని అన్నారు. విద్యార్థులకు విద్యా సామగ్రి,మధ్యాహ్న భోజనం వద్దని చెప్పటానికి ప్రభుత్వ స్కూళ్ళు గరికపాటి జాగీరు కాదని అన్నారు. మధ్యాహ్న భోజనం ద్వారా ఆరోగ్యం,ఆహారం విద్యార్థుల రాజ్యాంగ హక్కు అని గరికపాటి గ్రహించాలన్నారు. విద్యార్థులకు అన్నం పెడితే శోభనం రోజు పెళ్ళికొడుకులా ప్రవర్తిస్తానటం నిరుపేద చిన్నారుల పట్ల అతనియొక్క వివక్షాపూరిత వైఖరికి పరాకాష్ట అని అన్నారు.

గరికిపాటి నరసింహారావు తన మనవళ్లు,మనవరాళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి,అక్కడి విద్యార్థులతో చదువుల్లో పోటీ పడేలా చేయాలని సవాల్ చేశారు. ఇప్పటికైనా గరికపాటి నరసింహారావు పేదవిద్యార్థుల జీవన స్థితిగతులు,ఇబ్బందుల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని సురేష్ బాబు డిమాండ్ చేశారు.

పేదవిద్యార్థుల చదువులు,భోజన పథకంపై గరికపాటి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

- అర్బన్ పీహెచ్‌సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించబడ్డాయి. మొత్తం 38 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో గౌరవాధ్యక్షులుగా ఏ.వి. నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా టి. రాజా రత్నరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.చె. నాగరాజు, కోశాధికారిగా జి. యాకోబు ఎన్నికయ్యారు. వర్కింగ్ అధ్యక్షులుగా విజయ్, చి. ప్రవీణ్ బాధ్యతలు చేపట్టారు. నిర్వహణ కార్యదర్శులుగా జె. సింహాచలం, జి. ప్రసాద్ నియమితులయ్యారు.

వైస్ అధ్యక్షులుగా కె. రాజశేఖర్, ఓ. గోపి, కె.వి. సురేంద్ర, కె. శాంతామణి, బి. విజయలక్ష్మి, జి. ప్రశాంతి, వై. తిరుపతమ్మ ఎన్నిక కాగా, జాయింట్ కార్యదర్శులుగా వై. కేశవరావు, టి. సుబ్రమణ్యం, టి. రాము, ఎం.వి. గోపాల్, ఏ. కుటుంబరావు, కె. విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

జోనల్ కార్యదర్శులుగా నాలుగు జోన్లకు పది మంది ఎంపికయ్యారు. మొదటి జోన్‌కు కె.పి. నాయుడు, ఎస్. బాలరాజు, జి. రమణబాబు; రెండో జోన్‌కు కె. సురేంద్రబాబు, డి. శ్రీను నాయక్, కమలాకర్ గుప్తా; మూడో జోన్‌కు ఎస్. సాయి తేజ, ఎస్‌కె. నూర్ భాషా; నాల్గో జోన్‌కు సాయి విగ్నేష్, కిషోర్ కుమార్ నియమితులయ్యారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఏ. సుభాషిణి, కె. మహేష్, టి. మధు, శివ, కృష్ణమోహన్, దుర్గారావు, రమేష్, . శిరీష ఎన్నికయ్యారు.

మహిళా వర్కింగ్ కమిటీ కన్వీనర్‌గా కె. శాంతామణి నియమితులై, బి. విజయలక్ష్మి, కె. విజయలక్ష్మి, జి. ప్రశాంతి, ఏ. నాగరాజమ్మ, పి. సుభాషిణి, వై. తిరుపతమ్మ, రమణకుమారి, చి. శిరీష, బి. శాంతకుమారి, బి. చిన్ని సభ్యులుగా ఉన్నారు.

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నూతన కమిటీ సమర్థంగా పనిచేస్తుందని తెలిపారు.

# మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాక శుభ పరిణామం : మంత్రి అచ్చెన్నాయుడు హర్షం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిదర్శనం..ఆయన కృషి అమోఘం..అనిర్వచనీయం
- ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి మార్గాల ద్వారా లక్ష మందికి అవకాశం
- దేశంలోనే అత్యున్నత స్థాయిలో మొట్టమొదటి గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్
- నవ్యాంధ్ర కే తలమానికం..ఎవ్వరూ ఊహించని రీతిలో లక్షన్నర కోట్ల పెట్టుబడి
- కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఇరవై నెలల్లోనే సాధించిన అద్భుత విజయం ఇది
- భారత దేశ నిర్మాణంలో నవ్యాంధ్ర కీలక భాగస్వామ్యం వహించడం శుభ పరిణామం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నవ్యాంధ్రకే తలమానికం అన్నరీతిలో ఉత్తరాంధ్రకే మకుటాయమానం అన్నవిధంగా ఇవాళ ఆర్సెల్లార్ మిట్టల్ మరియు నిప్పాన్ స్టీల్ సంయుక్త భాగస్వామ్యంత అనకాపల్లి నియోజకవర్గం, నక్కపల్లి మండలం, రాజయ్యపేటలో గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయడం, ఇందుకు కేంద్ర ఉక్కుశాఖామాత్యులు హెచ్డీ కుమార స్వామి, శ్రీనివాస వర్మ,గౌరవ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ సారథ్యం వహించడం శుభ పరిణామం అని వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మారనున్న మిట్టల్ స్టీల్ ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటుతో లక్ష మందికి ప్రత్యక్ష మరియు పరోక్ష విధానంలో యువతకు ఉపాధి దొరకడంతో సుందర సముద్ర తీరాన ... యువత భవితకు భరోసా దక్కడం ఖాయమని అన్నారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు అనుబంధంగా రూ. 11, 198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు కావడం, అలానే తద్వారా ఆరువేల ఉద్యోగాలు రావడం అన్నవి ఉత్తరాంధ్ర యువకులకు ఆశాకిరణంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మారనుందని తెలిపారు.

**ప్రతిష్టాత్మక కంపెనీల రాకకు మార్గం సుగమం :** ఏఎంఎన్ఎస్ ఇండియా రాకతో పరిశ్రమల హబ్ గా విశాఖ రీజియన్ మారనుండడంతో పాటే పెట్టుబడులకు స్వర్గ ధామంగా నవ్యాంధ్ర రూపుదిద్దుకోవడం ఖాయమని, ఇప్పటికే ఇండస్ట్రీస్ కు క్యాపిటల్ సిటీగా ఉన్న విశాఖ నగరికి ఇది ఒక వరం కానుందని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు త్వరగా పూర్తయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. ఇప్పటికే విశాఖను ఐటీ హబ్ గా మార్చే క్రమంలో గౌరవ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి అని, గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో పాటే, మరికొన్ని ప్రతిష్టాత్మక కంపెనీల రాకకు మార్గం సుగమం అయిందని అన్నారు.

**చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం..ఆయన కృషి అమోఘం..అనిర్వచనీయం :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెట్టుబడులను తీసుకుని రావడంలో నిరంతరం చేస్తున్న కృషి అమోఘం అని కితాబిస్తూ, గతంలో నెలకొన్న ప్రతిష్టంభనకు తెర దించుతూ.. ఆయన చేస్తున్న విధి విధానాల అమలు ఎంతైనా శ్లాఘనీయం అని అన్నారు.

ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్ ను ప్రథమ స్థానంలో నిలిపేందుకు గౌరవ ముఖ్యమంత్రివర్యులు చేస్తున్న ప్రతి ప్రయత్నం ఇవాళ సత్ఫలితాలు ఇస్తూ, పోటీ ప్రపంచాన నవ్యాంధ్రను అగ్రగామిగా నిలుపుతున్నాయని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధే కాకుండా సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని, అందుకు తగ్గ ఆలోచనలు, అందుకు తగ్గ కార్యాచరణలు వేగవంతం చేయడంతో ఆయన ఎప్పటికప్పుడు సత్ఫలితాలు అందుకుంటున్నారని కితాబు ఇచ్చారు.

**ప్రగతి దిశగా పరుగులు..వేగంవేగంగా అభివృద్ధి:** రాష్ట్రాన్ని ప్రగతి దిశగా పరుగులు తీయించడంలో ముఖ్యంగా మౌలిక వసతుల కల్పన వృద్ధి, అలానే పారిశ్రామిక వేత్తలకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతుల జారీ, అలానే భూ సేకరణలో పారదర్శకతకు పట్టం కట్టే వైనం ఇవన్నీ ఇవాళ పెట్టుబడుల ఆకర్షణకు ఉపయోగపడుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ముఖ్యంగా తీర ప్రాంత అభివృద్ధి వికాసం అన్నవి ధ్యేయంగా ఇవాళ దేశ ప్రగతిలో భాగంగా బ్లూ ఎకానమి (సముద్ర తీర ప్రాంత ఆధారిత ఆర్థిక లావాదేవీలతో కూడిన వ్యవస్థ) ని పెంపొందించే దిశగా ముఖ్యమంత్రి వేగంవేగంగా అడుగులు వేస్తున్నారని, ఇదెంతో శుభ పరిణామం అని ఆనందం వ్యక్తం చేశారు.

**700 రకాలకు పైగా ఉక్కు ఉత్పత్తులు తయారు చేసే అవకాశం :** దేశంలోనే అగ్రగామి సంస్థలు మన రాష్ట్రం వైపు ఇవాళ చూస్తున్నాయని, ఇందుకు పారిశ్రామిక రంగంకు ప్రభుత్వం ఇస్తున్న ఊతం, ఆకర్షణీయం అయిన రాయితీలు కారణంగా నిలుస్తున్నాయని తాను భావిస్తున్నానని చెప్పారు. మిత్తల్ స్టీల్ కంపెనీ ఏర్పాటు, వికాసం అన్నవి రాష్ట్ర పురోగతికి కారణం కావడమే కాకుండా అనుబంధ రంగాల వృద్ధికి ఎంతో తోడ్పాటు అందించనుందని ఏడాది 8.2 ఎంటీపీఏ (మిలియన్ టన్స్ పెర్ యానమ్) ఉత్పత్తే లక్ష్యంగా పనిచేయడంతో ఇక్కడి ఆర్థిక వృద్ధి బాగుంటుందని తాను భావిస్తున్నానని అన్నారు. దేశానికే గర్వకారణంగా నిలిచే ఈ పరిశ్రమ రాక కారణంగా 700 రకాలకు పైగా ఉక్కు ఉత్పత్తులు తయారు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేను నిర్మిస్తాను..భారత్ నిర్మాణం అవుతుంది..అనే నినాదంతో ఈ కంపెనీ ఏర్పాటు..శంకుస్థాపన..నిర్మాణ గతి అన్నవి మరో చరిత్రకు నాంది అని తెలిపారు. తొలుత కంపెనీ సారథులు లక్ష్మీ నారాయణ మిత్తల్, ఆదిత్య మిత్తల్ తో మంత్రి అచ్చెన్నాయుడు సమావేశం అయ్యారు. ఈ ప్రతినిధుల సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు.

## 136మంది పిల్లలకు 30మంది భోజనమా ?

- పిల్లలపై కొంచెమైనా మానవత్వం లేదా ?
- ఎండీఎంను వెంటనే సస్పెండ్ చేయండి
- ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**"పాఠశాలలో 136 మంది పిల్లలకుగాను కనీసం 30 మందికి కూడా సరిపోనంత భోజనం వండుతారా ? పిల్లల ఆకలి గురించి పట్టదా ? కొంచెమైనా మానవత్వం ఉందా ? వెంటనే ఇన్చార్జి ఎండీఎంను సస్పెండ్ చేయండి. రెండు రోజుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడండి. విద్యార్థులతో ఆటలాడితే సహించేది లేదు" అంటూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మహాకవి తిక్కన ఎస్ పీకే హెచ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నసీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ఎంత మంది హాజరయ్యానే అంశాలపై ఆరా తీశారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకునేందుకు వంట శాల వద్దకు వెళ్లారు. ఎంత మంది పిల్లలకు వంట చేస్తున్నారు ? ఎంత ఇండెంట్ తీసుకున్నారు ? ఇప్పటి వరకు ఎంత మందికి వంట పూర్తి చేశారు ? అంశాలపై ఎండీఎంను ప్రశ్నించారు. 136 మంది పిల్లలకు ఇండెంట్ తీసుకున్నట్లు ఎండీఎం చెప్పడంతో ఎమ్మెల్యే నసీర్ అవాక్కయ్యారు. అక్కడ కనీసం 30 మంది పిల్లలకు కూడా సరిపోని విధంగా ఆహారం తయారు చేయడంతో ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా పిల్లలకు మీరు పెడుతున్న భోజనం అంటూ మండిపడ్డారు. వెంటనే మండల విద్యాశాఖాధికారిని పిలిపించి ఎండీఎంను సస్పెండ్ చేయాలని, పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన సక్రమంగా లేదని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా రంగం బలోపేతానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నారని, క్షేత్రస్థాయిలో వ్యవస్థను నిర్వీర్యం చేస్తే సహించబోమని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలలను తనిఖీ చేస్తానని, ఎలాంటి లోపాలు ఉన్నా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఉపాధ్యాయులు, అధికారులు, పని చేయాల్సి ఉంటుందని చెప్పారు.

## విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు నగరంలోని 52వ డివిజన్ అరండల్‌పేట పిచ్చుకలగుంట వద్ద నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల (అంధుల) క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ అరండల్ పేట 52వ డివిజన్‌లోని పిచ్చుకలగుంట గ్రౌండ్‌లో అంధుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో ఆనందకరమని, ఆంధ్రప్రదేశ్ అంధుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి గొప్ప క్రీడా కార్యక్రమాన్ని ప్రోత్సహించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ఇది ఇంటర్ స్టేట్ టోర్నమెంట్‌గా నిర్వహించబడుతుండగా, ఆంధ్రప్రదేశ్ జట్టు మరియు మధ్యప్రదేశ్ జట్టు పాల్గొనడం విశేషమన్నారు. అంధుల క్రికెట్ ఎలా ఆడతారో ప్రత్యక్షంగా చూడాలనే ఉత్సాహంతో తాను ఈ కార్యక్రమానికి వచ్చినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

భారతదేశం అంధుల క్రికెట్‌లో వరల్డ్ కప్ సాధించడం గర్వకారణమని, అర్జున అవార్డు గ్రహీత అజయ్ వంటి క్రీడాకారులు దేశానికి గౌరవం తీసుకువచ్చారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తుచేశారు. అలాగే పారా ఒలింపిక్స్ వంటి వేదికలలో విభిన్న ప్రతిభావంతులు అద్భుత ప్రతిభను ప్రదర్శిస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని, ఇలాంటి క్రీడలు మరింత ప్రోత్సాహం పొందాలని, సమాజంలో ప్రతి ఒక్కరూ విభిన్న ప్రతిభావంతులను కలుపుకొని ముందుకు సాగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ఈ తరహా టోర్నమెంట్లు మరిన్ని నిర్వహించేందుకు పెద్దలు, సంస్థలు సహకరించాలని, ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం తానే గొప్ప విజయమని, గెలుపు-ఓటమి కంటే ధైర్యం, పట్టుదల ముఖ్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

## కొంగాడ్‌లో బీజేపీ జోరు... భారీ విజయం ఖాయం



- బీజేపీ ఎన్నికల ఇంచార్జీ కిలారు దిలీప్

**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** కేరళలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ విజయం సాధించడం ఖాయమని కొంగాడ్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ ఎన్నికల ఇంచార్జీ కిలారు దిలీప్ ధీమా వ్యక్తం చేశారు. కొంగాడ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా రేణు సురేష్ సోమవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

ఈ నామినేషన్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని ర్యాలీగా జిల్లా కార్మిక కార్యాలయానికి చేరుకుని, అక్కడ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాలతో, నినాదాలతో ప్రాంతం మార్మోగింది.

ఈ సందర్భంగా కిలారు దిలీప్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, బీజేపీ పాలనకు మద్దతు పెరుగుతోందని తెలిపారు. అభివృద్ధి, పారదర్శక పాలన, అవినీతి రహిత వ్యవస్థ కోసం ప్రజలు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. కొంగాడ్ నియోజకవర్గంలో రేణు సురేష్ విజయం ఖాయమని, పార్టీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తే చరిత్రాత్మక ఫలితాలు సాధించవచ్చని అన్నారు.

అభ్యర్థి రేణు సురేష్ మాట్లాడుతూ, స్థానిక సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యాలని వెల్లడించారు. ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# మంగళగిరి టెక్స్టైల్స్‌లో భారీ చోరీ

- భారీ యంత్రాలను ముక్కలుగా చేసి అమ్ముకున్నారు
- తొమ్మిది మంది నిందితులు అరెస్టు
- వివరాలను వెల్లడించిన నార్త్ సబ్ డివిజన్ డీఎస్పి సిహెచ్ మురళీకృష్ణ
- పరారీలో కీలక నిందితులు
- 45 లక్షల 20వేల రూపాయల నగదు రికవరీ
- 3 వాహనాలు, 41 ఎలక్ట్రిక్ మోటర్లు సీజ్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** కంచె చేనును మేసిన చందంగా భారీ యంత్రాల రక్షణకు బాధ్యతలు అప్పగిస్తే , భారీ యంత్రాలను ఇనుప, స్టీల్ ను ముక్కలు ముక్కలుగా చేసి అమ్ముకున్నారు. భారీ చోరీ కేసులో 9 మంది నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి సిహెచ్ మురళి కృష్ణ అరెస్ట్ వివరాలను వెల్లడించారు.

**పూర్వపరాలు ఇలా...**

మంగళగిరి మండలం చిన్న కాకాని రాజ్ కమల్ రోడ్ లోని మంగళగిరి టెక్స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పేరుతో 12.54 ఎకరాలలో డాక్టర్ గోలి నాగ సైన్రావు మరియు ఇతర డైరెక్టర్లు కలసి 2009లో మంగళగిరి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో 24.5 కోట్ల రూపాయలు రుణం పొందారు. బిల్డింగ్ కట్టి మిషనరీ కొనుగోలు చేసి 2010లో ఉత్పత్తి ప్రారంభించారు. కాల క్రమంలో బ్యాంకు రుణం చెల్లించకపోవడంతో 2016 లో డిఫాల్టర్ గా పరిగణించి, కంపెనీని యధా స్థితిలో బ్యాంక్ ఆధీనంలో తీసుకొని, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో కేసు నమోదు చేశారు. కేస్ అడ్మిట్ చేసి ఇమ్మనేని ఈశ్వరరావును రీ సొల్యూషన్ ప్రొఫెషనల్ గా నియమించారు.

ఈశ్వరరావు కంపెనీ కి తనకు తెలిసిన గజ్జలకొండ గోపాల్ ను శ్రీ సూర్య తేజ సెక్యూరిటీ సర్వీసెస్, నియమించి గజాన సెక్యూరిటీ సర్వీస్ ద్వారా కుక్కను ఏర్పాటు చేసి మంగళగిరి మండలం బేతపూడి కి చెందిన కల్వకొల్లు గోపిరాజు, జలాల పురం కు చెందిన నారాయణను నియమించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంపెనీ ఆస్తులు పోకుండా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

గత నెల 28 న కంపెనీలో భారీ యంత్రాలు చోరీకి గురి అయినట్లు గుర్తించి ఈశ్వరరావు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా నమోదు చేశారు. మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం ఆధ్వర్యంలో మంగళగిరి రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేయగా భారీ యంత్రాల దొంగతనం కేసు చిక్కుముడి వీడిందన్నారు.

**భారీ యంత్రాలను ముక్కలుగా చేసి కరిగించేశారు...**

గోపాల్ దుర్బుద్ధితో వాచ్మెన్లను డబ్బు ఆశ చూపించి తనకు అనుకూలంగా మలుచుకుని, కూలీలతో గ్యాస్ కట్టర్లతో భారీ యంత్రాలను కట్ చేసి విజయవాడకు చెందిన పాత ఇనుప సామాన్లు ( స్క్రాప్ షాప్ ) కొనుగోలు చేసే వ్యక్తులకు క్రమ క్రమంగా విక్రయించినాడు. యంత్రముక్కులను కొనుగోలు చేసిన స్క్రాప్ దుకాణదారులు హైదరాబాద్, స్టీల్ మెల్టింగ్ దుకాణాలకు పంపించి స్క్రాప్ ను కరిగించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

**కీలక నిందితులు పరారీ లో...**

ఈ కేసులో నిందితులైన కల్వకొల్లు గోపి రాజు. తిమ్మిశెట్టి సత్యనారాయణ, సాలిపల్లి ప్రసాద్, కలివరపు మోహన్ కుమార్, తిరుపతి అనిల్ కుమార్, షేక్ హుస్సేన్, చిన్నపరెడ్డి కోటిరెడ్డి, బారెడ్డి రామి రెడ్డి, అరవ అయ్యప్పలను అరెస్టు చేసినట్లు డిఎస్పి మురళీకృష్ణ తెలిపారు.

45 లక్షల 20 వేల రూపాయల నగదును నిందితులు వద్ద నుండి రికవరీ చేయగా, మహేంద్ర బొలెరో పికప్ వ్యాన్, మహేంద్ర స్కార్పియో, స్వరాజ్ ట్రాక్టర్ ఇంజన్, 41 ఎలక్ట్రిక్ మోటార్లు ను చేసినట్లు డిఎస్పి తెలిపారు. కేసులో ప్రధాన ముద్దాయి గజ్జలకొండ గోపాల్ అమెరికా వెళ్ళగా, ఏ 2 భాను, ఏ 12 సాయి రెడ్డిలు పరారీ లో ఉన్నారని వారిని త్వరలోనే పట్టుకుంటామని డిఎస్పి మురళీకృష్ణ వెల్లడించారు.

విలేకరుల సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐలు రత్నరాజు, పి శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుళ్లు డి శ్యామ్ కుమార్ బి రామలింగేశ్వర రావు కె అంకమ్మరావు, కానిస్టేబుళ్లు ఎన్.సాగర్ రాము ఎన్ క్రాంతి కుమార్ ఉన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467